
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 32.0
కనిష్ఠం 24.2
****

ANDHRAJYOTHY



నల్లగొండ

5


సోమవారం 8 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	1,67,886	1,67,886
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,424.06	1,711.69
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.423 (43.3542)	1,34,00	1,43,502

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

కనువిందుచేసిన చంద్రగ్రహణం



ఆకాశంలో చంద్రుడి అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఆదివారం రాత్రి 9.56 నుంచి 1.26 గంటల వరకు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడింది. ఈ సుందర దృశ్యాన్ని పలువురు తిలకించేందుకు ఆసక్తి చూపగా, కొందరు ఇళ్లకే పరిమితమై స్వామి వారి నామస్మరణలో నిమగ్నమయ్యారు. సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి, జిల్లా కేంద్రంలోని రామాలయంతోపాటు పలు ఆలయాలను, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో ఆదివారం మధ్యాహ్నం 12.25 గంటలకు స్వామివారికి రాజభోగం నిర్వహించి ద్వారబంధనం చేశారు. గుట్టలో సోమవారం వేకువజామున 3.30గంటలకు ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ అనంతరం 5.30గంటలకు సుప్రభాతం సేవ నిర్వహించనున్నారు. 7



చెర్వుగట్టు ఆలయ ద్వారబంధనం చేస్తున్న దేవస్థాన సిబ్బంది



గణపయ్యా @198.74 కోట్లు



- నవరాత్రోత్సవాలకు పెద్దఎత్తున ఖర్చు
- అధికంగా విగ్రహాలు, అన్నదానం, పూజారులకు
- బ్యాండ్ మేళాలు, అలంకరణలకు సైతం
- ఉమ్మడి జిల్లాలో 13,284 విగ్రహాలు నెలకొల్పిన భక్తులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గణేష్ నవరాత్రోత్సవాలను ప్రజలు వైభవంగా నిర్వహిస్తుంటారు. దేనికీ వెనుకాడకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం సాంప్రదాయంగా వస్తోంది. కొన్నిచోట్ల ఉత్సవాలు మూడు, ఐదు రోజులకే పరిమితం అవుతుంటాయి. అయితే ఏడాదికేడాది ఉత్సవాల ఖర్చు పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 13,284 విగ్రహాలను ప్రతిష్ఠించగా సుమారు రూ.197.74 కోట్లు ఖర్చు చేసినట్లు అంచనా.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట (కలెక్టరేట్)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ ఏడాది గణేష్ నవరాత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. ప్రతిష్ఠాపన నుంచి శోభాయాత్ర వరకు ఆనందోత్సాహాల మధ్య కన్నుల పండువగా ఉత్సవాలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 13,284 గణేష్ విగ్రహాలను నెలకొల్పగా అందులో సూర్యాపేట జిల్లాలో 3,250, నల్లగొండ జిల్లాలో 5,984.... యాదాద్రి-భువనగిరి జిల్లాలో4,050 ఉన్నాయి.

- మిగతా 8వ పేజీలో...



అన్నదానం చేస్తున్న భక్తులు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో..

అవసరాలు	ఖర్చు (రూ. కోట్లలో)
విగ్రహాలకు	56.84
అన్నదానం పులిహోర	53.64
శోభాయాత్రకు	3.51
పురోహితులకు	14.62
అలంకరణ బ్యాండ్‌మేళాలు, లైటింగ్	45.13
పూజాసామాగ్రి	15
మద్యానికి	10
మొత్తం	198.74

విషాదాలు వెన్నంటే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రోత్సవాల్లో పలు అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. నల్లగొండ జిల్లా వేముల పల్లి మండలకేంద్రంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వలో విగ్రహాలను నిమజ్జనం చేసిన అనంతరం స్నానం చేస్తూ మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన తండ్రీ, కుమారులు పున్న సాంబయ్య, శివమణిలు గల్లంతయ్యారు. తండ్రి సాంబయ్య మృతదేహం లభ్యమైంది. అదే విధంగా సూర్యాపేటలోని పూలసెంటర్ సమీపంలో గణేష్ శోభాయాత్రలో పట్టణానికి చెందిన ఆలేటి శ్రీనివాస్ చిన్నారులతో కలిసి డ్యాన్స్ చేస్తూ గుండెపోటు రావడంతో కుప్పకూలి మృతి చెందాడు. కోదాడలో శోభాయాత్ర సందర్భంగా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నరేష్‌పై కొందరు యువకులు మద్యం మత్తులో దాడి చేయగా కానిస్టేబుల్ తలకు తీవ్రగాయమైంది. తిప్పర్తి మండలంలో నిమజ్జనం చేసి వస్తూ ట్రాక్టర్ పైనుంచి పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు.

లంబోదరుడి లడ్డూకు.. డిమాండ్

రూ.లక్షలు వెచ్చించి దక్కించుకున్న భక్తులు 6



నల్లగొండలో రూ.5,00,116 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న ఇంజనీర్ బొడ్డుపల్లి సతీష్

జడ్చర్ల-కోదాడ ఎన్‌హెచ్-167 విస్తరణకు

కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్



నాలుగు లేన్లుగా మారనున్న దేవరకొండ-కోదాడ జాతీయ రహదారి

- నాలుగు లేన్లుగా దేవరకొండ-కోదాడ రహదారి
- 219కి.మీ మేర విస్తరణ
- రోడ్ల విస్తరణతో దేవరకొండ వ్యాపారుల ఆందోళన
- బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి

దేవరకొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల-కోదాడ వయా దేవరకొండ మీదుగా వెళ్లే జాతీయ రహదారి-167ని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న రహదారి జడ్చర్ల, కల్వకుర్తి, దేవరకొండ, కొండమల్లేపల్లి, హాలియా, మిర్యాలగూడ మీదుగా కోదాడ వరకు 219 కిలోమీటర్లు నాలుగు వరుసలుగా మారనుంది. 2028 వరకు రోడ్ల విస్తరణ పూర్తి చేయాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రోడ్ల విస్తరణ నేపథ్యంలో దుకాణాలు పోతాయని దేవరకొండ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గతంలో రోడ్ల విస్తరణతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, మళ్లీ నాలుగు లేన్ల విస్తరణతో వ్యాపారాలు దెబ్బతింటాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బైపాస్ ఏర్పాటు చేయాలని విన్నపం

కోదాడ-జడ్చర్ల, దేవరకొండ మీదుగా జాతీయ రహదారి విస్తరణలో బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని వ్యాపారులు ప్రజాప్రతినిధులను కలిసి విన్నవిస్తున్నారు. గతంలోనే రోడ్డు విస్తరణలో నష్టపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నామని వ్యాపారులు చెబుతున్నారు. రోడ్డు విస్తరణకు అనుకూలమైనప్పటికీ దేవరకొండ మీదుగా కొండమల్లేపల్లికి బైపాస్ చేస్తే ఇబ్బందులు ఉండవని వారు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరగా రోడ్ల విస్తరణపై ఇంకా మార్గదర్శకాలు రాలేదని, పూర్తి సమాచారం లేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి



జడ్చర్ల-కోదాడ వయా దేవరకొండ మీదుగా నాలుగు లేన్ల రహదారిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం హర్షణీయం. రోడ్డు విస్తరణ జరిగితే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయి. దీంతోపాటు వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. స్థానిక భూములకు సైతం డిమాండ్ పెరుగుతుంది.

● నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, దేవరకొండ

రైతులకు మళ్లీ నిరాశే!

- వ్యవసాయ యాంత్రీకరణ మరోసారి వాయిదా
- యూరియా సమస్య తీరాకే యాంత్రీకరణపై దృష్టి
- మౌఖిక ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- అక్టోబరులోనే పరికరాలు పంపిణీ చేసే అవకాశం
- లబ్ధిదారులకు ఎంపికకు ప్రారంభంకాని కసరత్తు

నల్లగొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూపొందించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం రెండో మారు కూడా వాయిదా పడింది. ప్రస్తుతం యూరియా కొరత ఏర్పడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు దీనిపై దృష్టిసారించారు. ఫలితంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు పక్కనపడింది.

యాంత్రీకరణ పథకానికి సంబంధించి గతంలో ఉన్న మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం మార్చి నూతన మార్గదర్శకాలను ఈ ఏడాది జూలై నెలాఖరున విడుదల చేసింది. దీంతో వ్యవసాయశాఖ అధికారులు నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించారు. అయితే వానాకాలం సీజన్‌లో యూరియా కొరత తీవ్రం కావడంతో ప్రభుత్వం తప్పని పరిస్థితిలో అక్టోబరు నెలకు ఈ పథకాన్ని వాయిదా వేసింది. ఈ మేరకు ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీచేసింది.


యాంత్రీకరణకు రూ.6.18కోట్లు కేటాయింపు

వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు కోసం ఉమ్మడి జిల్లా ప్రభుత్వం రూ.6.18కోట్లు కేటాయించింది. అందులో నల్లగొండ జిల్లాకు రూ.3.14కోట్లు, సూర్యాపేటకు రూ.1.84కోట్లు, యాదాద్రి జిల్లాకు రూ.1.24కోట్లను వ్యయం చేయనుంది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ ఇవ్వనుండగా జనరల్ కేటగిరీ రైతులకు 40శాతం సబ్సిడీ వర్తింపజేయనున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం అమలు ఆలస్యం కావడంతో బడ్జెట్ కేటాయింపులు చేయలేకపోయారు. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపులు పూర్తికాగా, యూరియా కొరత కారణంగా వాయిదా పడింది. ఈ పథకాన్ని అక్టోబరులో పూర్తిస్థాయిలో అమలు చేసే అవకాశాలు ఉన్నాయి.

పూర్తికాని దరఖాస్తుల పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించి గత నెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వ్యవసాయశాఖ అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. అదే విధంగా గతంలో రైతులు చేసుకున్న దరఖాస్తులను సైతం అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. మండల వ్యవసాయాధికారులు అన్ని దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపారు. అయితే ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు గత నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఈ దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. ఇదే సమయంలో రైతులకు యూరియా కష్టాలు మొదలవడంతో దరఖాస్తుల పరిశీలను అధికారులు వాయిదా వేశారు. అదే విధంగా మండల స్థాయిలో కమిటీలు సైతం లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు చేయాల్సి ఉంది. ఒకవేళ దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కారణాలను కూడా రైతులకు తెలియజేయాలి. గతంలో పేర్కొన్న షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 21 నుంచి 27వ తేదీ వరకు ఎంపికైన రైతుల నుంచి డీడీలను తీసుకునే ప్రక్రియతో పాటు అదే నెల 27 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు యంత్ర పరికరాలకు ఆర్డర్ ఇవ్వడం, ఈ నెలలో 7 నుంచి 17వ తేదీలోగా అర్హత పొందిన ప్రతీ రైతుకు పరికరాలు పంపిణీ చేయాలి. అయితే

మిగతా 8వ పేజీలో...



ప్రవక్త బోధనలను యువత ఆచరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రవక్త బోధనలను యువత ఆచరించి సన్మార్గంలో నడవాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. ఆదివారం మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహ్మద్ ప్రవక్త మానవాళికి అందించిన బోధనలను ఆచరించినప్పుడే జీవితం సుఖమయంగా ఉంటుందన్నారు. యువత ముందుకు వచ్చి విరివిగా రక్తాన్ని దానం చేయాలన్నారు. రక్తదానం చేస్తే ఎందరో రోగుల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు.

మిలాద్ కమిటీ బాధ్యులు మాట్లాడుతూ, కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా సుమారు 15 రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి సేకరించిన రక్తాన్ని ప్రమాదాలబారిన పడిన రోగులకు అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ ఎమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మిలాద్ కమిటీ సభ్యులు గౌస్, ఏకే.ఖాన్, షరీఫ్, హషం, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ డబ్బులు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరారెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగులో ఉన్న కార్మికుల డబ్బును వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు దరఖాస్తు చేసుకున్న ఈఎస్‌ఐ, పీఎఫ్ క్లైమ్స్ పెండింగులో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఏఎల్‌వో, ఏసీఎల్, ఇతర సిబ్బంది నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న నల్లగొండలో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పోలె సత్యనారాయణ, సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఆవుట రవీందర్, యూనియన్ మండల అధ్యక్షుడు గాదె యాదయ్య, దోటి పరమేశ, తదితరులు పాల్గొన్నారు.

మరో గ్రంథాలయ ఉద్యమానికి శ్రీకారం

- నేడు 'పుస్తకంతో నడక' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- విద్యావికాస వేదిక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మరో గ్రంథాలయ ఉద్యమానికి శ్రీకారం చుట్టే 'పుస్తకంతో నడక' కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యావికాస వేదిక వ్యవస్థాపక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ, ఏ తోడూ లేనప్పుడు పుస్తకమే తోడుంటుందన్నారు. పుస్తకాలు చదివినకొద్దీ రాయిలాంటి మనిషి వజ్రంలా రాటుదేలుతాడని అన్నారు. పుస్తకాలు చదవడం అందరి జీవితంలో భాగంగా మారాలన్నారు. సినిమాలకు, షికార్లే కాకుండా అంతా గంథ్రాలయాలకు కూడా వెళ్లాలని అన్నారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ర్యాంకులు, మార్కులు తప్ప పిల్లలకు మరో ప్రపంచం తెలియకుండా చేస్తున్నారని అన్నారు. సెల్‌ఫోన్ చేతిలో ఉంటే అన్నీ తెలిసినట్లు భ్రమలో ఉంటున్నారని, ఇది పిల్లల భవితకు మంచిది కాదన్నారు. కొత్త తరానికి పఠనాసక్తిని పెంపొందించేందుకు ఈ నెల 8న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ భాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి చిక్కడపల్లి కేంద్ర గంథ్రాలయం వరకు పుస్తకం చేతపట్టి నడక కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, దీన్ని విజయవంతం చేయాలని కోరారు. రచయితలు, కవులు, జర్నలిస్టులు, విద్యావంతులు, పుస్తక ప్రియులు, ప్రచురణకర్తలు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాయుధ పోరు

సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతికంగా మట్టి మనుషులు సాయుధ పోరాటాన్ని నిర్వహించారని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలోని మగ్దూమ్ భవనంలో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి, భుక్తి కోసం దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మట్టి మనుషులు చేసిన రైతాంగ సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా బీజేపీ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సాయుధ పోరులో నాలుగువేల మంది అమరులు రక్త తర్పణ చేశారన్నారు. దొరలు, భూస్వాముల లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీలకే దక్కిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి సాయుధ పోరాట యోధులకు పింఛన్లను ఎత్తివేసిన హీనమైన చరిత్ర ఉందని విమర్శించారు. సెప్టెంబరు 17 పేరుతో బీజేపీ కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. ఈనెల 11 నుంచి 17 వరకు సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రైతాంగా సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. చిట్యాల మండలం గుండ్రాపల్లి గ్రామంలో 11న అమరుల స్తూపం వద్ద ఈ సాయుధ పోరాటం వారోత్సవాలు ప్రారంభిస్తామన్నారు. అదేవిధంగా ఈ నెల 10న నల్లగొండలో సీపీఐ కేంద్ర మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొరత అత్యధికంగా ఉన్నదని, కేంద్రం రాష్ట్ర ప్రభుత్వంపై కక్షగట్టి యూరియా కోటాను ఇవ్వకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

సమావేశంలో పార్టీ నాయకులు నలపరాజు రామలింగయ్య, పల్లా నర్సింహారెడ్డి, పల్లా దేవేందర్‌రెడ్డి, లోడంగి శ్రావణ్‌కుమార్, పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, బొల్లురి నర్సింహ, తిర్పారి వెంకటేశ్వర్లు, అంజచారి, తదితరులు పాల్గొన్నారు.

లంబోదరుడి లడ్డూకు... డిమాండ్



నల్లగొండలో రూ.5,00,116 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న ఇంజనీర్ బొడ్డుపల్లి సతీష్

- రూ.లక్షలు వెచ్చించి దక్కించుకున్న భక్తులు
- నల్లగొండలో రూ.5 లక్షలకు పైగా..
- కోదాడలో రూ.3 లక్షలకు...
- నాగార్జునసాగర్, పోచంపల్లి, చౌటుప్పల్, చింతపల్లిల్లో రూ.2 లక్షలకు పైగా

సాధారణంగా లడ్డూలంటే ఎవరైనా ఇష్టపడుతుంటారు. అందులోనూ దేవాలయాల్లో లభించే లడ్డూలకు ప్రాశస్త్యం ఉండటంతో భక్తితో తీసుకుంటారు. ఆలయాల్లో కొనుగోలు చేసిన లడ్డూలను ఇళ్లకు తీసుకెళ్లి పూజచేసి తినే వాళ్లూ చాలామందే ఉంటారు. అవన్నీ అందరికీ లభించేవే. మరి స్వామి వారి చేతిలోని లడ్డూనే వస్తుందంటే దక్కించుకోవాలని ఎవరికి ఇష్టం ఉండదు. వైభవంగా నిర్వహించే గణేష్ నవరాత్రోత్సవాల్లో స్వామి వారి చేతిలో పెట్టే లడ్డూకు ఎంతో డిమాండ్ ఉంటుంది. ఆ లడ్డూను కైవసం చేసుకునేందుకు నిర్వాహకులు పాడే వేలంలో పోటాపోటీగా పాల్గొంటారు. లడ్డూను కైవసం చేసుకోవడం అదృష్టంగా, స్వామి కృపగా భావిస్తుంటారు. ఈ క్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల నిర్వహించిన వేలంలో రూ.లక్షలు వెచ్చించి లడ్డూలను భక్తులు కైవ సం చేసుకున్నారు. వాటిలో కొన్ని ఇవి...

సూర్యాపేట(కలెక్టరేట్): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా నిర్వహించే లడ్డూ వేలంలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. గతంతో పోలిస్తే ఈసారి లడ్డూలకు డిమాండ్ పెరిగింది. నల్లగొండలోని హనుమాన్‌నగర్‌లోని లడ్డూను రూ.5,00,116 లకు ఓ భక్తుడు దక్కించుకున్నారు. సూర్యాపేటలో భజన మందిరం వద్ద లడ్డూకు రూ.2.20లక్షలు, ఆర్‌కే గార్డెన్స్‌లో విగ్రహం వద్ద లడ్డూకు రూ.2లక్షలకు పైగా వేలం పాడి దక్కించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో తక్కువలో తక్కువగా రూ.20వేల నుంచి రూ.లక్షకుపైగా పాటపడి లడ్డూలను దక్కించుకున్న వారు ఉన్నారు.

కోదాడలో రూ.3.51 లక్షలకు..

కోదాడ : సూర్యాపేట జిల్లా కోదాడలో శనివారం గణేష్ నిమజ్జనం సందర్భంగా లడ్డూలకు నిర్వహించిన వేలం పాటలు హోరాహోరీగా సాగాయి. పట్టణంలోని కాన్వాసింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని విగ్రహం వద్ద లడ్డూను శ్రీలక్ష్మీ సాయి లారీ సప్లయ్ కార్యాలయానికి చెందిన చింతల వీరయ్య రూ.3,51,557లకు వేలం పాడి దక్కించుకున్నారు. గత ఏడాది ఇక్కడి లడ్డూ రూ. లక్షా 15 వేలు పలకగా ఈ ఏడాది మూడు రేట్లు పెరిగింది. ఖమ్మం క్రాస్ రోడ్డులోని బత్తినేని హనుమంతరావు మండపం వద్ద వేలం పాటలో రూ.1,08,000లకు లడ్డూను కొండవీడు సుబ్బారావు సొంతం చేసుకున్నారు.

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని ఎన్‌జీవోస్ కాలనీలో 36 కిలోల వినాయక లడ్డూను రూ.1.80లక్షలకు మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, శరణ్య, కోతి లింగారెడ్డి కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు.

బీబీనగర్‌లో రూ.1.11 లక్షలకు

బీబీనగర్ : యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద రామాలయ యువజన సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశ్ మండపంలో లడ్డూను సామాజిక కార్యకర్త, టైగర్ చారిట్రబుల్ ట్రస్టు నిర్వాహకులు పంజాల సురేశ్‌గౌడ్ రూ.లక్షా 11వేలు పాట పాడి దక్కించుకున్నారు.

వలిగొండ : యాదాద్రిభువనగిరి మండలం వలిగొండ మండలం నెమలికాల్వ గ్రామంలో శ్రీగణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో వంగాల గోపిగౌడ్ రూ.1,86,000లకు వేలంపాడి లడ్డూను దక్కించుకున్నారు. వలిగొండలో ఓం యూత్ అసోసియేషన్ వద్ద లడ్డూను నూనె వంశీ రూ.1,13,000లకు కైవసం చేసుకున్నారు.

ఆలేరు : యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలకేంద్రం మంతపురి రోడ్డులో గణేష్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు నెలకొల్పిన గణేష్ మండపం వద్ద లడ్డూను రూ.1.55 లక్షలకు ఆలకుంట్ల రాజేశ్వరీశ్యాం దంపతులు దక్కించుకున్నారు. అలాగే వినాయకుడు కండువాను మార్గం సత్తయ్య రూ.32వేలకు, పంచెను వల్లపు శంకర్ రూ.22వేలకు దక్కించుకున్నారు.



సాగర్‌లో 101 కిలోల లడ్డూను కైవసం చేసుకున్న భక్తులు

నాగార్జునసాగర్ : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో క్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి లడ్డూకు 23 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా భారీ ధర పలికింది. 101 కిలోల లడ్డూకు వేలం నిర్వహించగా దివ్య ఫొటోస్టూడియో యజమాని ఎర్రబోయిన సూరేష్ రూ.2.30 లక్షలకు వేలం పాడి దక్కించుకున్నారు. 23 ఏళ్లలో ఏనాడూ రూ.50 వేలు దాటకపోవడం గమనార్హం.



కోదాడలో రూ.3.51 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న చింతల వీరయ్య బృందం

పండ్లు, కలశాన్ని వనం యాదగిరి రూ.22వేలకు కైవసం చేసుకున్నారు.

తుర్కపల్లి: యాదాద్రిజిల్లా తుర్కపల్లి మండలకేంద్రంలో విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశ్ మండపం వద్ద లడ్డూను బుర్రి రాము-మాధూరి దంపతులు వేలంలో రూ.లక్షకు కైవసం చేసుకున్నారు.

పోచంపల్లిలో రూ.2,44,444లకు..

భూదాన్‌పోచంపల్లి : యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని 101 యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద లడ్డూ వేలం పాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఇంద్రియాల గ్రామానికి చెందిన ధరావత్ వెంకటేష్ రూ.2,44,444లకు లడ్డూను దక్కించుకున్నారు. అదేవిధంగా గాంధీనగర్ మహాగణపతి వద్ద లడ్డూను అంకం మురళి రూ.1.80 లక్షలకు, ధర్మారెడ్డిపల్లి గ్రామంలో రూ.1.47లక్షలకు కాసుల కనకయ్యగౌడ్ కుటుంబ సభ్యులు వేలం పాటలో లడ్డూలను దక్కించుకున్నారు.

చౌటుప్పల్‌లో రూ.2.01లక్షలకు

చౌటుప్పల్ టౌన్ : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని లింగోజీగూడలోని హనుమాన్‌నగర్ గణేష్ ఉత్సవ కమిటీ వినాయక లడ్డూను పర్నే శివారెడ్డి-రజిత దంపతులు వేలం పాటలో రూ.2,00,001లకు దక్కించుకున్నారు. అదేవిధంగా పండ్లను గంగదేవి వెంకటేశ్-అశ్విని దంపతులు రూ.41,000లకు పొందారు. యువ నేస్తం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద లడ్డూను రూ.1,10,116లకు ఇ.హరికృష్ణ-శ్రావణి దంపతులు దక్కించుకోగా, మార్కండేయనగర్‌లోని బాలగణేష్ మండపంలోని లడ్డూను రూ.27,500లకు ఊడుగు మల్లేశ్‌గౌడ్- కల్పన దంపతులు దక్కించుకున్నారు.

చింతపల్లిలో రూ.2.25 లక్షలకు

దేవరకొండ : నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లోని పలు గ్రామాల్లోని వినాయక విగ్రహాల వద్ద లడ్డూలకు గతంలో రూ.50వేల లోపే వేలంపాట పాడేవారు. ఈ సారి భక్తులు పోటాపోటీగా పాల్గొని రూ.లక్షలలో పాడి దక్కించుకున్నారు. చింతపల్లి మండలకేంద్రంలోని బాలగణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూను అగిరి రవీందర్-రాధ దంపతులు రూ.2.25 లక్షలకు వేలం పాడి దక్కించుకున్నారు.

- కొండమల్లేపల్లిలోని భరత్‌నగర్ యూత్ అసోసియేషన్ వద్ద లడ్డూను రూ.1,25,116లకు దక్కించుకున్నారు.
- నేరేడుగొమ్ము మండలం కొత్తపల్లిలో మాజీ సర్పంచ్ లోకసాని కృష్ణ రూ.1.16 లక్షలకు దక్కించుకున్నారు.
- దేవరకొండలోని పెద్దరామాలయం గణేష్ లడ్డూను శివశంకర్ అనే భక్తుడు రూ.66,116లకు దక్కించుకున్నారు.



భూదాన్‌పోచంపల్లి గాంధీనగర్‌లో రూ.1.80 లక్షలకు లడ్డూ దక్కించుకున్న అంకం మురళి

కొండగడపలో వరుసగా ఒక్కరే...

మోత్కూరు : వినాయకుడి వద్ద లడ్డూను దక్కించుకోవడం చాలా మంది అదృష్టంగా భావిస్తుంటారు. తమ కుటుంబంలో మంచి జరుగుతుందనే భావనతో కొన్నేళ్లుగా యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం కొండగడప గ్రామానికి చెందిన వ్యాపారి రమేష్-లక్ష్మీ దంపతులు, కుమారుడు-కోడలు మణికంఠ-కావ్యలు గణేష్ వద్ద లడ్డూలను వేలంలో దక్కించుకుంటున్నారు. ఈ పర్యాయం ఈ నెల 6న గణేష్ నిమజ్జనాలకు ముందు లడ్డూలను వేలం వేశారు. ఇమామ్‌సాబ్ మడిగె యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి వద్ద లడ్డూను రమేష్-లక్ష్మీ దంపతులు రూ.93,116లకు దక్కించుకున్నారు. వినాయకుని లడ్డూ తీసుకోవడం వల్ల తమ కుటుంబానికి మంచి జరుగుతుందని వారు తెలిపారు. సుమారు 15 ఏళ్లుగా తాను వేలంలో లడ్డూను తీసుకుంటున్నట్లు తెలిపారు. స్థానికులు ఎప్పుడు నీవేనా అనడంతో రెండు, మూడేళ్లు తీసుకోలేదని, తనకు మంచి జరగలేదని, అందుకే ఈసారి వేలంలో రూ.93,116లకు పాడి దక్కించుకున్నట్లు తెలిపారు.



కొండగడపలో వినాయకుని లడ్డు రూ.93,116లకు దక్కించుకున్న రమేష్-లక్ష్మీ దంపతులు వారి కుమారుడు, కోడలు మణికంఠ-కావ్య

మోత్కూరు పట్టణంలోని వీర్స్ యూత్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన వినాయకుడి మండపలం వద్ద లడ్డూ వేలంలో రూ.70,116లకు కొండ్రాతి మహేష్ దక్కించుకున్నారు.

లడ్డూ కోసం ముందస్తు జాగ్రత్త..

నార్కట్‌పల్లి : గణేష్ మండపాల వద్ద లడ్డూలను వేలంలో దక్కించుకోవడం చూస్తుంటాం. కానీ చోరీ చేసి ఆ మరుసటి ఏడాది తానే చోరీ చేసినట్లు ఒప్పుకుని వినాయక ప్రతిమలను అందించడం ఒక్క నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చిన్ననారాయణపురంలో జరిగింది. ఇలా మూడేళ్లు జరగడంతో ప్రస్తుతం జాగ్రత్తలు తీసుకుని వేలం వేస్తున్నారు. ఈ గ్రామంలో గణపతి చేతిలో పూజలందుకున్న లడ్డూను గుర్తుతెలియని వ్యక్తులు వరుసగా చోరీ చేశారు. అయితే లడ్డూను చోరీ చేసిన భక్తుడే తిరిగి మరుసటి వినాయక చవితికి వచ్చి స్వామివారి చేతిలోని లడ్డూను తానే చోరీచేశానని చెప్పి ఆ ఏడాది ఉత్సవాలకు వినాయక ప్రతిమ దాతగా ప్రకటించుకునేవారు. దీంతో వరుస మూడేళ్లు చోరీ అవుతుండటంతో చివరికి ఉత్సవ నిర్వాహకులు జాగ్రత్త పడి లడ్డూకు వేలం పాట పెట్టడం ప్రారంభించారు.



నార్కట్‌పల్లిలో నవశక్తి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి వద్ద లడ్డూను రూ.1,10,116లకు దక్కించుకున్న బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి



ఆలేరులో రూ.1,55,000లకు లడ్డూ దక్కించుకున్న ఆలకుంట్ల రాజేశ్వరి శ్యాం దంపతులు

డెంగీతో మహిళ మృతి



బుజ్జమ్మ(ఫైల్‌ఫొటో)

భువనగిరి రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలో డెంగీ ఓ మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వడాయిగూడెం గ్రామానికి చెందిన వల్లాల బుజ్జమ్మ(50) మూడు రోజుల కింద అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు యాదగిరిగుట్టలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా ఆమెకు రక్త పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీగా నిర్ధారించారు. ఆమెను గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. ఆమెకు భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమె అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామమైన వడాయిగూడెంలో నిర్వహించారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సబ్బూరు బీరుమల్లయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జనగాం పాండు, నీల ఓంప్రకాశ్‌గౌడ్ ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలో పాల్గొన్నారు.వీరివెంట నాయకులు గుండు ముత్తయ్యగౌడ్, శెట్టి శ్రీకాంత్, బబ్బురి శంకర్, యాదగిరి, చంద్రయ్య పాల్గొన్నారు.

గేటు పైనుంచి పడి రియల్‌ఎస్టేట్ వ్యాపారి



శ్రీనివాస్‌గౌడ్(ఫైల్)

భువనగిరి రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో మద్యం మత్తులో గేటు పైనుంచి కిందికి దిగుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. భువనగిరి ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ ప్రాంతానికి చెందిన గుండ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్(54)కు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో ఆయనకు ఓ ఇల్లు ఉంది. సొంత పనినిమిత్తం భార్య మంగమ్మతో కలిసి అప్పుడప్పుడు ఇక్కడికి వస్తుంటాడు. ఈ క్రమంలో తాజ్‌పూర్ భార్యాభర్తలు వచ్చారు. మద్యం తాగిన శ్రీనివాస్‌గౌడ్ బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా అతడి భార్య మంగమ్మ అడ్డుకుని గేటుకు తాళం వేసింది. ఈ క్రమంలో మద్యం మత్తులో గేటు పైనుంచి ఎక్కి కిందకు దిగేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కాగా కుటుంబసభ్యులు భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ మేరకు శ్రీనివాస్‌గౌడ్ భార్య మంగమ్మ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

మద్యం మత్తులో కానిస్టేబుల్‌పై దాడి



గాయపడిన కానిస్టేబుల్ నరేష్

కోదాడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఘర్షణకు దిగిన ఇరువర్గాలను ఆపేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌పై దాడి జరిగింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడలో శనివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే వినాయక నిమజ్జనానికి విగ్రహంతో అనంతగిరి రోడ్డులో ఓ వర్గం బయలుదేరింది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు తమ కారుకు దారి ఇవ్వలేదంటూ శోభాయాత్రకు వెళ్తున్న యువకులతో ఘర్షణ దిగారు. దీంతో విగ్రహాన్ని తరలిస్తున్న యువకులకు, కారులోని వారికి మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. అంతేకాక ఇనుపరాడ్లతో దాడి వరకు వెళ్లింది. ఈ క్రమంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఓరుగంటి నరేష్ వారిని సముదాయించేందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఓ నాయకుడు విచక్షణ కోల్పోయి కానిస్టేబుల్ తలపై ఇనుపరాడ్డుతో మోదాడు. దీంతో నరేష్ తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో అక్కడే ఉన్న మరికొందరు కానిస్టేబుల్ నవీన్‌ను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

గణేష్ నిమజ్జనంలో వ్యక్తికి ..

ఆత్మకూరు(ఎం) సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ల గ్రామంలో గణేష్ నిమజ్జనంలో గడ్డం రవి అనే యువకుడికి గాయాలయ్యాయి. శనివారం రాత్రి ప్రారంభమైన శోభాయాత్ర, ఆదివారం ఉదయం వరకు కొనసాగింది. స్థానికచెరువులో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేసి యువకులు ట్రాక్టర్‌పై తిరిగి వస్తున్నారు. ఇంజన్‌పై కూర్చున్న గడ్డం రవి ప్రమాదవశాత్తు జారీ టైర్‌కింద పడ్డాడు. ఈ ఘటనో రవి కుడి చేతికి తీవ్రంగా గాయమైంది. చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

కారు ఢీకొని కూరగాయల వ్యాపారి మృతి



సేవ్య మృతదేహం

మునగాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో కూరగాయల వ్యాపారం చేసే ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం గ్రామ హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై జరిగింది. ఎస్‌ఐ బీ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నడిగూడెం మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటతండాకు చెందిన బానోతు సేవ్య(60) ఆ గ్రామ నుంచి కూరగాయలను ద్విచక్రవాహనంపై తీసుకువచ్చి ముకుందాపురం గ్రామంలో ప్రతి రోజు విక్రయించి వెళ్తుంటాడు. అదేక్రమంలో ఆదివారం కూరగాయలు విక్రయించి తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై హైవేపై దాటుతుండగా వెనక నుంచి హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సేవ్య అక్కడికక్కడే మృతి చెందారు. సేవ్య కుమారుడు సాయిభరత్ ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కు చెందిన కారు డ్రైవర్ రాజుకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి వెంట ఉన్న ముకుందాపురం గ్రామంలో అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటుచేయాలని కోదాడ ఎంఎస్ కళాశాల అధిపతి పందిరి నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటివరకు రోడ్డు పాసింగ్ వద్ద ప్రమాదాల్లో 40 మంది మృతి చెందారని, ఎంతో మంది క్షతగాత్రులుగా మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు.

అదుపుతప్పి పల్టీకొట్టిన ఆటో..




అదుపు తప్పిన ఆటోను పక్కకు జరుపుతున్న గ్రామస్థులు

మోత్కూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజిపురం శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు నుంచి మోత్కూరుకు ప్రయాణికులతో ఆదివారం మధ్యాహ్నం ఆటో బయలుదేరింది. అనాజిపురం శివారులో అడ్డంవచ్చిన కుక్కను తప్పించే ప్రయత్నంలో ఆటో అదుపుతప్పి పల్టీకొట్టింది. ఆటో డ్రైవర్ చాంద్ మీద పడటంతో తీవ్రంగా గాయపడగా, మరో ఏడుగురు ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు ఆటోలోంచి చాంద్‌ను ప్రయాణికులను తీసి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అక్రమంగా యూరియా విక్రయాలపై విచారణ

కేతేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాత్రి వేళ ఎలాంటి సమాచారం లేకుండా యూరియా విక్రయించిన ఘటనపై విచారణ జరిపి నోటీసులు జారీ చేసినట్లు నల్లగొండ జిల్లా కేతేపల్లి ఏవో బీ.పురుషోత్తం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం యూరియా కొరత నెలకొన్న నేపథ్యంలో ఏదైనా ఎరువులదుకాణానికి అందుబాటులోకి వచ్చిన యూరియాకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంది. సదరు యూరియాను ఈ-పోస్ యంత్రం ద్వారా రైతుల ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం ఆధారంగా వ్యవసాయ అధికారుల సమక్షంలో రైతులకు విక్రయిస్తున్నారు. కొద్దిరోజులుగా కేతేపల్లి మండలంలో యూరియా విక్రయాలు ఇలాగే సాగుతున్నాయి. ఈ క్రమంలో కేతేపల్లిలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రానికి శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో 111బస్తాల యూరియా లోడుతో లారీ వచ్చింది. యూరియా వచ్చిన విషయాన్ని వ్యవసాయ అధికారులకు తెలియజేయాల్సి ఉన్నా సదరు దుకాణం నిర్వాహకులు అలాంటిదేమీ చేయలేదు. యూరియాను రాత్రికి రాత్రి విక్రయిస్తున్నారంటూ స్థానికంగా వాట్సాప్ గ్రూప్‌లో ప్రచారం సాగింది. దుకాణం నిర్వాహకులు తమకు కావాల్సిన వారికి గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారంటూ వ్యవసాయ అధికారులకు స్థానికులు కొందరు సమాచారం ఇచ్చారు. ఆ మేరకు మండల వ్యవసాయ అధికారి బీ.పురుషోత్తం రాత్రి 9గంటల ప్రాంతంలో హుటాహుటిన కేతేపల్లికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అప్పటికే 111 యూరియా బస్తాల విక్రయాలు పూర్తికావడంతో తమకు సమాచారం ఇవ్వకుండా ఎలా విక్రయిస్తారని దుకాణాదారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా విక్రయాలపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిన ఆయన దుకాణాలోని రికార్డులు పరిశీలించి వెళ్లారు. తిరిగి ఆదివారం సదరు దుకాణ రికార్డులను మరోసారి పరిశీలించి యూరియా విక్రయాలపై విచారణ జరిపి తమకు సమాచారం ఇవ్వకుండా యూరియా విక్రయించిన దుకాణ నిర్వాహకులకు సంజాయిషీ నోటీసు జారీ చేసినట్లు ఏవో పురుషోత్తం తెలిపారు. ఇదిలా ఉంటే ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి వచ్చిన యూరియాను అనధికారికంగా దుకాణాదారు రాత్రికి రాత్రి అధికధరకు విక్రయించారని దీనిపై పూర్తి విచారణకు సోమవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.



కేతేపల్లిలో రాత్రివేళ యూరియా బస్తాలతో వెళుతున్న ట్రాక్టర్

బీఆర్‌ఎస్ నాయకుడిపై హత్యాయత్నం కేసు నమోదు

చివ్వెంల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్ర పరిధిలోని దురాజ్‌పల్లి బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ ఎస్‌కే బాషాపై హత్యాయత్నం కేసు నమోదైంది. సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం దురాజ్‌పల్లికి చెందిన మునీర్‌ఖాన్ గాయాలతో శనివారం రాత్రి 11 గంటల సమయంలో చివ్వెంల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మాజీ కౌన్సిలర్ బాషా తనను పొడిచాడని ఫిర్యాదుచేశాడు. ఆ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ నిమిత్తం అర్ధరాత్రి రెండు గంటలకు బాషాను పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. బాషాను అదుపులోకి తీసుకున్న విషయం తెలుసుకున్న ఆయన మద్దతుదారులు ఆదివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. బాషాను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉదయం 8 గంటల నుంచి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ రాజశేఖర్ 11 గంటల ప్రాంతంలో ఆందోళనకారులతో మాట్లాడారు. అనంతరం బాషాను విడుదల చేశారు. దీంతో ఆయన మద్దతుదారులు ఆందోళన విరమించారు. కాగా మునీర్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేశ్వర్ పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాషా మద్దతుదారులు

ఎడమకాల్వలో శివమణి

మృతదేహం లభ్యం



శివమణి(ఫైల్)

వేములపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా వేములపల్లిలోని సాగర్ ఎడమకాల్వలో ఈ నెల 5న గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 5న గణేష్ నిమజ్జనం అనంతరం చేతులు, కాళ్లు కడుక్కుంటుండగా మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూరుకు చెందిన పున్నం సాంబయ్య కాల్వలోకి జారిపడ్డాడు. ఆయన కాపాడే క్రమంలో కుమారుడు శివమణిలు కూడా కాల్వలోపడి గల్లంతయ్యారు. మూడురోజులుగా సాగర్ ఎడమ కాల్వపై గాలింపుచర్యలు చేపట్టగా శనివారం సాంబయ్య మృతదేహం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలో లభ్యమైంది. ఆదివారం కుమారుడు శివమణి మృతదేహం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొను గోడు రిజర్వాయర్‌లో లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో కోడె మృతి

శాలిగౌరారం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో విద్యుదాఘాతంతో కోడె మృతి చెందింది. జాలోనిగూడెం గ్రామానికి చెందిన జమ్ము అశోక్‌కు చెందిన కోడే గ్రామశివారులో మేత చేస్తుంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. కోడే విలువ రూ.30వేలు ఉంటుందని బాధితుడు అశోక్ తెలిపారు.

చోరీకి యత్నించిన దంపతులపై కేసు

చండూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీ బ్యాటరీని చోరీ చేసేందుకు యత్నించిన దంపతులపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా చండూరు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు. శనివారం చండూరు పట్టణ శివారులోని ఓ వేబ్రిడ్జి వద్ద పడమటి తాళ్ల గ్రామానికి చెందిన జిల్లా శ్రీనివాస్‌కు చెందిన లారీని రోడ్డు పక్కన నిలిపి గ్రామానికి వెళ్లాడు. ఇది గమనించిన మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్‌కు చెందిన భార్యాభర్తలు నిఖిల్, శ్వేతలు లారీ బ్యాటరీని చోరీ చేసేందుకు యత్నించారు. అదే సమయంలో ఇంటి నుంచి లారీ వద్దకు చేరుకున్న శ్రీనివాస్ బ్యాటరీ తొలగిస్తున్న విషయాన్ని గమనించి నిలదీయడంతో ద్విచక్రవాహనంపై కనగల్ వైపు పారిపోయారు. వారిని వెంబడించి కనగల్ మండలం జీ.యడవెల్లి గ్రామ శివారులో పట్టుకుని చండూరు పోలీసులకు అప్పగించారని ఎస్‌ఐ తెలిపారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు భార్యభర్తలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వృత్తి, విద్య శిక్షణ కోసం ఒప్పందం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కిషోర్‌రెడ్డి, ఘంటా చక్రపాణి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వృత్తి, విద్యా నైపుణ్యాల పెంపొందించడానికి అందుకు అవసరమైన సాంకేతిక శిక్షణ కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్‌టీఆర్ఐ)తో ఆదివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఘంటా చక్రపాణి, ఎస్ఆర్‌టీఆర్ఐ సంస్థ ఛైర్మన్ డాక్టర్ కిషోర్ రెడ్డి సమక్షంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విజయకృష్ణారెడ్డి, ఎస్ఆర్‌టీఆర్ఐ సంస్థ డైరెక్టర్ హరికృష్ణ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్యయోజన (డీడీయూ-జీకేవై) ద్వారా అందించే వృత్తి విద్యా కోర్సులను అంబేడ్కర్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు అందించేలా ఈ ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం ఎస్ఆర్‌టీఆర్ఐ సంస్థ ఛైర్మన్ డాక్టర్ కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో తమ సంస్థ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీతో కలిసి ఉపాధి కోర్సులను తెలంగాణ వ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్ పుష్పా చక్రపాణి, ప్రొఫెసర్ పల్లవి కాబ్దే, ఈఎంఆర్ఆర్‌సీ డైరెక్టర్ ప్రొఫెసర్ రవీంద్రనాథ్ సోలమన్, విభాగాల డైరెక్టర్లు ఆయా విభాగాల అధిపతులు, డీన్లు పాల్గొన్నారు.

విశ్వకర్మ స్ఫూర్తి జాతీయ పురస్కారానికి ఎంపిక

హుజూర్‌నగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్ పట్టణంలోని పీర్లచావిడి సెంటర్‌కు చెందిన చేకూరి నర్సింహాచారి విశ్వకర్మ స్ఫూర్తి లెజెండరీ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 14వ తేదీన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు సంఘ అధ్యక్షుడు పాలోజుల రాజకుమారాచార్యులు తెలిపారు. విరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధునిక ధార్మిక కళాపరిషత్ జాతీయ సాహితీ, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ, తెలుగు ఇండియన్ కల్చర్, బుక్‌ఆఫ్ వరల్డ్ సంస్థల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో కృషి చేస్తున్న వారిని గుర్తించి విశ్వకర్మ జాతీయ పురస్కారాలు అందజేస్తున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆలయాలు మూసివేత

● సంపూర్ణ చంద్రగ్రహణం ప్రభావం, నేడు సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం



యాదగిరిగుట్ట ప్రధానాలయంలోని గర్భాలయాన్ని మూసి వేసిన దృశ్యం

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో ఆదివారం మధ్యాహ్నం 12.25 గంటలకు స్వామివారికి రాజభోగం నిర్వహించి ఆలయం మూసివేశారు. ఆదివారం రాత్రి 9.56 నుంచి 1.26 గంటల వరకు చంద్రగ్రహణం ఉండటంతో, సోమవారం వేకువజామున 3.30 గంటలకు ఆలయం తెరిచి సంప్రోక్షణ చేస్తారు. తెల్లవారుజామున 5.30 గంటలకు సుప్రభాతం, 6.30నుంచి 7 గంటల వరకు బాలభోగం, 7 నుంచి 7.45 గంటలకు వరకు నిజాభిషేకం, 7.45 నుంచి 8.15 గంటల వరకు సహస్ర నామార్చన, 7.45 నుంచి 9.30 గంటల వరకు సుదర్శన నారసింహ హోమం, 10.15 గంటలకు స్వామివారి నిత్యకల్యాణం నిర్వహిస్తారు. ప్రధానాలయం, అనుబంధ, ఉప ఆలయాల్లో ఆదివారం మధ్యాహ్నం 12గంటల లోపు నిత్య కైంకర్యాలు, నివేదనలు పూర్తి చేసిన తర్వాత ఆలయ ద్వార బంధనం చేశారు. కొండకింద ఆధ్యాత్మిక వాడల్లో సత్యదేవుడి వ్రతాలు సోమవారం ఉదయం, సాయంత్రం కలిపి నాలుగు (ఉదయం 7.10 గంటలు, మధ్యాహ్నం 12గంటలు, సాయంత్రం 4గంటలు) విడతలు, వాహన పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం రద్దు చేసిన ఊరేగింపు సేవలు, అర్చన, ఆరాధన, శయనోత్సవ కైంకర్యాలను ముందుగా ప్రకటించిన సమయం ప్రకారం కొనసాగిస్తారు. ఆలయం మూసివేత సమయం వరకు భక్తుల రద్దీ సాధారణంగా కొనసాగింది.

చెర్వుగట్టు ఆలయం మూసివేత

నార్కట్‌పల్లి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడలరామలింగేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆదివారం మూసివేశారు. ఉదయం పూజలు, అభిషేకాలు, అర్చనలు, భక్తుల సర్వదర్శనం అనంతరం మధ్యాహ్నం స్వామివారికి నివేదన సమర్పించి ఆలయద్వారాలను మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తిరిగి భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

మట్టపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం...

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవాలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు మహర్నివేదన చేసిన అనంతరం దేవాలయ ద్వారబంధనం చేసినట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ తెలిపారు. స్థానిక శివాలయం కూడా చంద్రగ్రహణం కారణంగా మూసివేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయాల్లో సంప్రోక్షణ, శుద్ధి చేసిన అనంతరం ఉదయం 10నుంచి యథావిధిగా భక్తులకు దర్శన సౌకర్యం కల్పిస్తామన్నారు.

మేళ్లచెర్వు శివాలయం

మేళ్లచెర్వు: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరి సమేత స్వయంభూ శంభులింగేశ్వరస్వామి వారి ఆలయాన్ని ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ఆలయ అర్చకులు, సిబ్బంది మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయ శుద్ధి అనంతరం ఉదయం 8 గంటల నుంచి సాధారణ భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని ఆలయ అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి నాగేళ్ల శంభిరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



చెర్వుగట్టు పార్వతీమాత ఆలయద్వారానికి తాళం వేస్తున్న దేవస్థాన సిబ్బంది

● సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలో చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నుంచి దేవాలయాలను మూసివేశారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, వేదాంత భజనమందిరం, శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం, శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయం, విజయాంజనేయస్వామి దేవాలయాన్ని సాయంత్రం నుంచి మూసివేశారు. ఆయా ఆలయాల అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, దరూకి సింగచార్యులు, రామానుజాచార్యులు, మురళీదరాచార్యులు ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాత్రి 9.56 గంటల నుంచి అర్ధరాత్రి 1.26 గంటల వరకు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుందన్నారు. తిరిగి దేవాలయం సోమవారం ఉదయం 6 గంటలకు తెరిచి సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



మేళ్లచెర్వు శివాలయాన్ని మూసివేస్తున్న ఆలయ అర్చకులు, సిబ్బంది

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైన జట్లు

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ఈనెల 13వ తేదీ నుంచి నిర్వహించే బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్లు ఎంపిక చేసినట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.స్వామి, ప్రధాన కార్యదర్శి బయ్యన్న తెలిపారు. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు విద్యుత్ పోల్ క్రీడా మైదానం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపికైన జట్లు రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అలీంఅసద్, పి.జంగయ్య, ఎం.అంజల్‌రావు, ఉమామహేశ్వర్, గణేష్, దేవేందర్ పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి నల్లగొండ బాల, బాలికల జట్లలను అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బయ్యన్న ప్రకటించారు. క్రీడాకారులకు విద్యుత్‌శాఖ శ్రీనివాస్ భోజన వసతి కల్పించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

బాలుర విభాగంలో... జస్వంత్, చిన్ని, శివ, అంజి, అజయ్ (చండూరు), దిలీప్, శశి, (గట్టుప్పల్) వరుణ్, సంజయ్ (మిర్యాలగూడ), వికాస్ (అనుముల).

బాలిక విభాగంలో... అక్షర, శ్రీవాణి, సాహితి, మోక్ష (గట్టుప్పల్), ఏకాంబరేశ్వరి, శృతి; జ్యోత్స్న (మిర్యాలగూడ), అక్షిత (కట్టంగూరు), అక్షర (అప్పాజిపేట), హర్షిత (రామన్నపేట) ఎంపికయ్యారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జతిన్‌యాదవ్

హాలియా,సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నడ్డి జతిన్‌యాదవ్ ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరులో ఆగస్టు 5 నుంచి 10వ వరకు జరిగిన తెలుగు రాష్ట్రాల అండర్-19 సీబీఎస్ఈ క్లస్టర్ పోటీల్లో ప్రతిభను కనబరిచి సిల్వర్ మెడల్ సాధించారు. దీంతో జతిన్‌యాదవ్ ఈ నెల సెప్టెంబరు 9 నుంచి 13వ తేదీన వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీల్లో దాదాపు 50 దేశాల క్రీడాకారులు హాజరుకానున్నారు. 2024లోనూ జాతీయస్థాయి పోటీలకు ఎంపికై వరుసగా రెండు పర్యాయాలు జాతీయ స్థాయిలో అథ్లెటిక్ పోటీలకు జతిన్ ఎంపికయ్యాడు. మారుమూల గ్రామానికి చెందిన జతిన్ జాతీయ స్థాయిలో అథ్లెటిక్ రంగంలో ఎంపిక కావడంపై తల్లిదండ్రులు నడ్డి బాలరాజుయాదవ్, అంజలి దంపతులు అభినందించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో రాణించి మంచి గుర్తింపు సాధించాలని వారు ఆకాంక్షించారు.



జతిన్ యాదవ్

మళ్లీ తెరుచుకున్న సాగర్ గేట్లు

● ఎగువ నుంచి వచ్చిన వరద వచ్చినట్టే దిగువకు విడుదల ● 589.70 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం



నాగార్జునసాగర్ 14 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. ఈ సీజన్‌లో సాగర్ గేట్లు తెరచుకోవడం ఇది మూడో సారి. ఈ సీజనల్ మొదటి సారి జూలై 29వ తేదీన, రెండోసారి ఆగస్టు 13వ తేదీన, ఆదివారం మూడోసారి గేట్లు తెరిచారు. సాగర్‌కు ఎగువ నుంచి వరదరాక పెరగడంతో శనివారంరాత్రి రెండు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. గంట గంటకు వరదరాక పెరుగుతుండంతో గేట్ల సంఖ్యను పెంచుతూ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 14 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఎగువనుంచి వచ్చిన వరదను వచ్చింది వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రం 589.70అడుగులు వద్ద ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 589.70 అడుగులు (311.1486టీఎంసీలు)గా ఉంది. సాగర్‌నుంచి కుడి కాల్వ ద్వారా 9,500 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 8,454 క్యూసెక్కుల నీటిని, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 34,266 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని, 26 క్రస్ట్‌గేట్లలో 14గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,12,966 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌నుంచి మొత్తం 1,67,886 క్యూ సెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 1,67,886 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. ఎగువ నుంచి 1424.06 ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు 2, 8 నెంబరు క్రస్టుగేట్లను అడుగు మేర ఎత్తి 1076.03 క్యూసెక్కులు వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టి ఇన్‌ఫ్లో నిలకడగా వస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టు నీటిమట్టాన్ని 643.50అడుగులు(4.07టీఎంసీ)ల వద్ద నిలకడగా ఉండేలా చూస్తూ అదనపు నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 575.64 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645 అడుగులు (4.46టీఎంసీ)ల నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టం 643.50 అడుగులు (4.07టీఎంసీ)గా ఉంది.

బుద్ధవనం సందర్శించిన హెరిటేజ్ బృందం



బుద్ధవనంలో రూరల్ డెవలప్‌మెంట్ అండ్ హెరిటేజ్ బృందం సభ్యులు

నాగార్జునసాగర్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనాన్ని ఇండియన్ ట్రస్ట్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ హెరిటేజ్ బృందం సభ్యులు ఆదివారం సందర్శించారు. ఏపీ కల్చరల్ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జున్‌రావు ఆధ్వర్యంలో ఢిల్లీకి చెందిన నిపుణులతో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా బుద్ధవనంలోని చరిత, ధ్యాన, జాతక, స్తూప మహాస్తూప వనాలను తిలకించారు. ఈ బృందానికి బుద్ధవనం ఈవో శాసన ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర బుద్ధవనం విశేషాలను వివరించారు. అనంతరం పంచశీల కండువాలతో సత్కరించారు. మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ గ్రామీణా వారసత్వం, అభివృద్ధి కోసం భారతీయ ట్రస్ట్ సంస్థ నాగార్జునసాగర్ రైట్ బ్యాంకులో బుద్ధిజం అకాడమీని స్థాపించడానికి స్థల పరిశీలన చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సంస్థ గ్రామీణ సంస్కృతులు, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు ఆ సంరక్షణను గ్రామీణ ప్రాంతాల స్థిరమైన ఆర్థిక అభివృద్ధి సాధించడంపై దృష్టి సారిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ట్రస్ట్ ఫర్ రూరల్ డెవలప్‌మెం ట్ అండ్ హెరిటేజ్ ఢిల్లీకి చెందిన సభ్యులు ఏజీకే మీనన్, ప్రీతి, పల్నాడు జిల్లా పర్యాటక శాఖ అధికారి నాయుడమ్మ పాల్గొన్నారు.

ఆ పేరే ప్రత్యేకం

● అసలు పేర్లకంటే పిలిచే పేర్లతోనే గుర్తింపు



మారుపేర్లకు నిలయమైన మఠంపల్లి గ్రామం

మఠంపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొంత మందికి వారి ఊళ్లలో అసలు పేరుకు బదులు మరో పేరు ఎక్కువ జన బాహుళ్యంలో ఉంటుంది. పెట్టిన పేరుతోనే వారికి ఎక్కువ గుర్తింపు ఉంటుంది. ఎవరైనా ఆ గ్రామానికి వెళ్లి స్థానికులు పిలిచే పేరును అడిగితేనే సంబంధిత వ్యక్తి చిరునామా దొరుకుతుంది. ఇలాంటి పేర్లు వారు చేస్తున్న వృత్తిని ఇతర వ్యాపకాలను బట్టి వస్తుంటాయి. ప్రతీ పల్లెలో ఇలాంటి వారు పదుల సంఖ్యలో తారస పడుతుంటారు. మఠంపల్లిలో మారు పేర్లతో పిలిచే వ్యక్తులు అధిక సంఖ్యలో ఉన్నారు.

ఓ బిరుదులా అనిపిస్తుంది



నా పేరు గోపు ఇన్నారెడ్డి. ఈ పేరు చాలా మందికి ఉండటంతో నేను చేస్తున్న వృత్తిని బట్టి నన్ను పంతులు ఇన్నారెడ్డి అని పిలుస్తుంటారు. పాతికేళ్ల నుంచి ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాను. పేరును ముందు పంతులు అని చెబితేనే నా చిరునామా స్థానికులు చెప్పగలరు. నా వృత్తికి ఉన్న ప్రత్యేకతతో అలా పిలుస్తుంటారు. ఇది నాకు ఓ బిరుదులా అనిపిస్తుంది.

● గోపు ఇన్నారెడ్డి, మఠంపల్లి


డీలర్‌గా కొనసాగడంతో..



రేషన్‌షాపు డీలర్‌గా 1990 నుంచి 2000 వరకు కొనసాగాను. అప్పట్లో నన్ను డీలర్ తోమాస్‌రెడ్డి అని పిలిచేవారు. అనంతరం పాలకేంద్రం నిర్వహణ, కళారంగ సేవలు వ్యవసాయ పనులు చేసినా ఇప్పటికీ డీలర్ తోమాస్‌రెడ్డి అనే పిలుస్తుంటారు. ఈ వృత్తిని మానేసి 25 సంవత్సరాలు దాటినా డీలర్ అనే పదం పేరుకు ముందు వాడుతూనే ఉంటారు.

● గోతమారి తోమాస్‌రెడ్డి, మఠంపల్లి


కోళ్లబాబుగానే గుర్తింపు



అందరూ నన్ను కోళ్ల బాబు అని పిలుస్తుంటారు. ఇది నేను చేసిన వ్యాపారాన్ని బట్టి ప్రజలు అలా పిలుస్తారు. 1988 నుంచి 2000 సంవత్సరం వరకు మఠంపల్లి గ్రామంలో కోళ్ల వ్యాపారం, చికెన్ వ్యాపారం చేశాను. అప్పట్లో నా ఒక్కడికే చికెన్ దుకాణం ఉండేది. అప్పటి నుంచి మండలంలో కోళ్ల బాబు అనే పిలుస్తారు. రెండు దశాబ్దాల నుంచి వివిధ వ్యాపారాలు చేస్తున్నా ఆ పేరు మాత్రం అలానే ఉండి పోయింది. అలా పిలవడం నాకు సంతృప్తినిస్తోంది.

● బోనగిరి ప్రకాష్‌బాబు, మఠంపల్లి

చెప్పులు లేని బాబు....



నా పేరు బాణోతు బాబు, మాది బీల్యానాయక్‌తండా. ఊహ తెలిసిన నాటి నుంచి మండలంలో పలు పనుల నిమిత్తం చెప్పులు లేకుండా తిరిగేవాడిని. ఇదే నా ఇంటి పేరుగా మారింది. తండాల్లో ఎవరైనా వచ్చి బాబు ఇల్లు ఎక్కడ అంటే ఎవరూ గుర్తు పట్టరు. కానీ చెప్పులు లేని బాబు అంటే ఠక్కున చెబుతారు. మండలవ్యాప్తంగా నన్ను చెప్పులు లేని బాబు అనే పేరుతోనే పిలుస్తుంటారు. సహకార సంఘంలో వైస్ ఛైర్మన్‌గా పని చేసినా చెప్పులేని బాబు అంటేనే గుర్తు పడతారు.

● బాణోతు బాలునాయక్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్

యూరియా కోసం పడిగాపులు

కొండమల్లేపల్లి, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లిలోని సాగర్ రోడ్డులో గల మన గ్రోమోర్ వద్ద ఆదివారం యూరియా కోసం ఎగబడ్డారు. గ్రోమోర్ కేంద్రానికి 440 బస్తాల యూరియా లోడ్ వచ్చిందన్న విషయాన్ని తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల రైతులు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డుతో మన గ్రోమోర్‌కు వద్దకు చేరుకున్నారు. దీంతో నిర్వాహకులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అనంతరం సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు ఒక్కొక్కరికీ రెండు బస్తాల చొప్పున టోకెన్లను అందించారు. గుంపులుగా ఉన్న రైతులను క్యూలైన్‌లో ఉండాలని సూచించారు. పోలీసుల సహకారంతో రైతులకు యూరియా బస్తాలను అందించినట్లు గ్రోమోర్ కేంద్రం నిర్వాహకుడు రవీందర్ తెలిపారు.



గ్రోమోర్ వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

బాధితులకు ఎమ్మెల్యే వీరేశం పరామర్శ

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని పలు కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం పరామర్శించారు. అనారోగ్యంతో కొద్దిరోజుల క్రితం చనిపోయిన నార్కట్‌పల్లిలోని సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త లింగాల రాములు కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. అదేవిధంగా శాపల్లి మాజీ సర్పంచ్ సిద్దగోని స్వామిగౌడ్ సోదరి కూడా ఇటీవల చనిపోగా మనోవేదనతో ఉన్న స్వామిగౌడ్‌ను వీరేశం పరామర్శించి ఓదార్చారు.

మారయ్య మృతి పార్టీకి తీరని లోటు : కంచర్ల

నల్లగొండరూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నర్సింగ్‌బట్ల గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు తిరుమల సైదులు తండ్రి తిరుమల మారయ్య మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి కంచర్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైదులుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, నాయకులు బిక్షం, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

రైతులకు సరిపడా ఎరువులు అందిస్తాం

గిరిప్రసాద్, ఏవో, కట్టంగూరు



మండలంలోని రైతులందరికీ సరిపడా ఎరువులను అందిస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి గిరి ప్రసాద్ అన్నారు. మాకు అందుబాటులో ఉన్న యూరియాను రైతులకు వెంటనే అందిస్తున్నాం. ప్రతీ రైతుకు ఎకరానికి రెండు బస్తాల చొప్పున అందజేస్తున్నాం.

(కట్టంగూరు, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో వరి, పత్తి పంటలను ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు?

ఏవో: మండలంలో 23,865 ఎకరాల్లో వరి, 10,770 ఎకరాల్లో పత్తి పంటలను సాగు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఇటీవల మండలంలో కురిసిన వర్షాలతో పంటలకు లాభమా? నష్టమా?

ఏవో: ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంటలకు ఎలాంటి నష్టం లేదు. కొంతమేర లాభం జరిగింది. ఈ వర్షాలతో ప్రారంభంలో ఉన్న వరి సాగు కన్నా దాదాపు మండలంలో 2 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణం పెరిగింది.

ఆంధ్రజ్యోతి: మండలానికి ఎంత యూరియా అవసరం ఉంది? ఇప్పటి వరకు ఎంత పంపిణీ చేశారు?

ఏవో: మండలానికి 2400 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటి వరకు 1960 మెట్రిక్ టన్నుల యూరియాను అందజేశాం. ప్రతి ఒక్క రైతుకు ఎకరాకు రెండు బస్తాల చొప్పున అందించాం. రైతులు ఇబ్బందులు పడకుండా సరిపడా ఎరువులను అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రతీ రైతు క్లస్టర్‌లో పంట నమోదు ఖచ్చితంగా చేయించుకోవాలా?

ఏవో: ప్రతీ రైతు ఏ సర్వే నెంబర్‌లో ఏ పంట సాగు చేస్తున్నారో ఆ వివరాలను ఏఈవోల ద్వారా నమోదు చేయించుకోవాలి. లేకపోతే రైతుబంధుకు ఇబ్బంది పడే అవకాశం ఉంది. అంతేకాక పంటను మార్కెట్‌కు తెచ్చినప్పుడు కూడా రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఈ రహదారిని బాగుచేసేదెప్పుడో?



గురజాల వద్ద జలాశయాన్ని తలపిస్తున్న నకిరేకల్ - మోత్కూర్ ప్రధానరోడ్డు (ఫైల్)

శాలిగౌరారం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ - మోత్కూరు ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారింది. శాలిగౌరారం మండలంలో ఈ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో పలు చోట్ల రోడ్డంతా చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోక లు సాగించే ఈ రహదారిని ఎవరూ పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గం ద్వారానే నకిరేకల్ నుంచి అమ్మనబోలు, మోత్కూర్, భువనగిరి, ఉప్పల్, జనగాం, వరంగల్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రో డ్డును నిర్మించి 30 సంవత్సరాలైన ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో మండ లంలోని గురజాల వద్ద అంబేడ్కర్ విగ్రహం సమీపంలో నడుము లోతు గుంత దాదాపు 30 మీటర్ల మేర ఏర్పడింది. వర్షం నీరు, గ్రామంలోని మురికి కాల్వల నీరు ఇక్కడ చేరి పెద్ద అగాధంగా మారింది. కనీసం పాదచారులు కూడా నడవలేని ప్రధాన రోడ్డు ఇది. న డుము లోతు నీరు ఉండటం వల్ల వాహనాల సైలెన్సర్ల భాగాలు మునిగి వాహనాలు ఆగి పోతున్నాయి. అసలు ఈ రోడ్డు రూపమే మారిపోయింది. ఇక్కడి నుంచి వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుగా డబుల్ రోడ్డుగా మార్చడంతో పా టు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో పోలీస్‌క్వార్టర్స్



నిరుపయోగంగా ఉన్న ఎస్‌ఐ నివాసగృహం, (ఇన్‌సెట్‌లో) సిమెంట్ పోయి సీకులు తేలిన గోడలు

చిట్యాల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చిట్యాలలోని పోలీస్‌క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. సుమారు 20 ఏళ్ల క్రితం పోలీసు కుటుంబాలకు వసతి కల్పించాలనే ఉద్దేశ్యంతో నిర్మించిన క్వార్టర్లు అనతికాలంలోనే శిథిలావస్థకు చేరుకున్నాయి. మూడు ఫ్లోర్లతో రెండు బిల్డింగులలో మొత్తం 10 క్వార్టర్స్ నిర్మించారు. ప్రస్తుతం అవి సిమెంట్ పోయి సీకులు తేలాయి. అప్పుడప్పుడు పెచ్చులు ఊడిపడుతున్నాయి. అందులో ఉంటున్న పోలీసుల కుటుంబసభ్యులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అందులోని నాలుగు క్వార్టర్స్ పూర్తిగా పాడవడంతో ఖాళీగా ఉన్నాయి.

నిరుపయోగంగా ఉన్న ఎస్‌ఐ క్వార్టర్

చిట్యాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో సుమారు పదేళ్ల క్రితం నిర్మించిన ఎస్‌ఐ నివాసగృహం నిరుపయోగంగా ఉండటంతో అది కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఎస్‌ఐ నివాసగృహం నిర్మించిన కొన్నాళ్లకే అందులో నివాసముంటున్న అప్పటి ఎస్‌ఐ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి అది ఖాళీగా ఉంది. ప్రస్తుతం అది కూడా శిథిలావస్థకు చేరుకుంది. శిథిలమైన క్వార్టర్స్‌ను మరమ్మతులు చేయడంతో పాటు కొత్త నివాసగృహాలు నిర్మించాలని పోలీసు సిబ్బంది కోరుతున్నారు.

ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ పట్టణ కమిటీ ఎన్నిక

రామగిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ నల్లగొండ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ షకీల్ ఆదేశాల మేరకు నూతన కమిటీని ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడిగా మహమ్మద్ జావిద్‌అలీ, మహమ్మద్ బషీరుద్దీన్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి షేక్ చాంద్‌పాషా కండువా కప్పి వారిని ఘనంగా సన్మానించి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు పట్టణ ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.



నియామకపత్రాలు అందజేస్తున్న నాయకులు

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఊరట

కేతేపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు పన్నుల భారం పడకుండా ఉండేందుకు జీఎస్టీని తగ్గించడం ప్రధాని మోదీ ప్రజలకు ఇచ్చిన పండగ కానుకని బీజేపీ మండల అధ్యక్షుడు పిట్ట వెంకట్ అన్నారు. జీఎస్టీని తగ్గించిన నేపథ్యంలో కేతేపల్లిలో ఆదివారం బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.అనితాగౌడ్, టి.నర్సింహాచారి, కె.వెంకటేశ్వర్లు, ఎస్.విజయలక్ష్మి, వి.నాగయ్య, పద్మ, ఎల్.సత్తయ్య, శ్రీను పాల్గొన్నారు.



కేతేపల్లిలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

జీఎస్టీ తగ్గింపుతో పేదలపై తగ్గనున్న ధరల భారం

చిట్యాలరూరల్: కేంద్రప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల పేదలపై ధరల భారం తగ్గుతుందని బీజేపీ చిట్యాల మండల అధ్యక్షుడు పీక వెంకన్న అన్నారు. మండలంలోని మండలం వనిపాకల గ్రామంలో ఆదివారం పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, సామాన్య ప్రజలు, రైతాంగానికి ఊరట కలిగించే విధంగా కేంద్రప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందని అన్నారు. ఆదాయం తగ్గుతుందని తెలిసినా దేశ ప్రజల ప్రయోజనాల కోసం తగ్గిం చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పున్న విష్ణు, మండల మాజీ అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహగౌడ్, నాయకులు వరికుప్పల నర్సింహ, ఉయ్యాల లింగస్వామి, పీక మహేష్, గంట మల్లేష్, లింగస్వామి, సత్యనారాయణ, లింగయ్య, ప్రవీణ్, సుధాకర్, మల్లేష్ పాల్గొన్నారు.



చిట్యాల మండలం వనిపాకలలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పీక వెంకన్న, నాయకులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

● డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు

నల్లగొండ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, విద్యార్థులకు గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఏఐసీబీ ఉపాధ్యక్షుడు, డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు అన్నారు. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గుర్రంపోడు మండలం కోనాయిగూడం పాఠశాలలో ఎస్‌జీటీ, ఎఫ్‌ఏసీ ప్రధానోపాధ్యాయుడు అక్కెనపల్లి యాదగిరికి ఆదివారం ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చొక్కారావు మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడు యాదగిరి తమ అంధుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించారని గుర్తు చేస్తూ అంధుల తరుపున అభినందనలు తెలిపారు. యాదగిరి అంధ విద్యార్థులకు, సాధారణ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి నిబద్ధత, అంకితభావంతో సేవలందించినందుకు ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు లభించిందన్నారు. డ్వాబ్ ఆధ్వర్యంలో వచ్చేసారి జాతీయ అవార్డు కోసం ప్రతిపాదనలు పంపుతామని అన్నారు.

వైభవంగా మాస కల్యాణాలు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు, గోపలాయపల్లి దేవస్థానాల్లో ఆదివారం మాస కల్యాణాలను నిర్వహించారు. పౌర్ణమి తిథిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ మాసకల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకలో గోపలాయపల్లి దేవస్థానం అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి తదితర దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



గోపలాయపల్లి గుట్టపై నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న భక్తులు

క్రీడలతో మనోధైర్యం: డాక్టర్ పుల్లారావు



కరాటే బెల్టులు ప్రదానం చేస్తున్న పుల్లారావు, రావుల శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మార్షల్ క్రీడలు విద్యార్థుల్లో మనోధైర్యాన్ని పెంపొందిస్తాయని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు, డాక్టర్ పుల్లారావు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రావుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కరాటే బెల్టుల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగాల్లో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. కరాటేలో తర్ఫీదు పొందిన క్రీడాకారులకు వివిధ విభాగాల్లో కరాటే బెల్టుల పోటీలు జరిగాయి. పలు కేటగిరీల్లో క్రీడాకారులకు ప్రతిభను కనబర్చారు. గెలుపొందిన క్రీడాకారులకు బ్లాక్, బ్లూ బెల్టులు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయం మూసివేత

● నేడు ఆలయంలో సంప్రోక్షణ

కనగల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకాఎల్లమ్మ ఆలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మూసివేశారు. ముఖ్య అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌చార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం సభ్యులు దామోదర్, మహేష్, శ్రీను, అవ్యయ్ గర్భగుడి తలుపులను మూసి ద్వారబంధనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం ఉదయం 7.30 గంటలకు ఆలయంలో సంప్రోక్షణ శుద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం అమ్మవారి దర్శనం కోసం భక్తుల ను ఆలయంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. అమ్మవారి భక్తులు ఈ విషయాన్ని గమనించి ఆలయ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకటయ్య, రవి పాల్గొన్నారు.



ఎల్లమ్మ ఆలయ గర్భగుడి తలుపులను మూసివేస్తున్న అర్చకులు

వెలిమినేడు ఆంజనేయస్వామి ఆలయ ద్వారబంధనం

చిట్యాలరూరల్: చిట్యాల మండలం వెలిమినేడు శివారులో జాతీయ రహదారి పక్కన గల శ్రీఆంజనేయస్వామి దేవస్థానం గర్భగుడికి చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం పురోహితుడు ద్వారబంధనం చేశారు. గ్రహణం వల్ల దేవతామూర్తులను దర్శనం చేసుకోరాదని ఆలయానికి ద్వారబంధనం వేశారు. గ్రహణానంతరం సోమవారం ఆలయాన్ని సంప్రోక్షణ నిర్వహించి స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పురోహితుడు వల్లూరి నిఖిల్‌శర్మ తెలిపారు. పూజల అనంతరం భక్తుల పూజలు, దర్శనాలు యథావిధిగా జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పురోహితుడు వల్లూరి భానుప్రకాష్‌శర్మ, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

మహిళలు ఆర్థికంగా ఎదగడానికే సమాఖ్య

శంకర్, ఏపీఎం, శాలిగౌరారం



ప్రభుత్వ సహకారంతో మహిళలు ఆర్థికశక్తిగా ఎదగడానికి కృషి చేస్తున్నామని శాలిగౌరారం మండల మహిళా సమాఖ్య ఏపీఎం పోలేపల్లి శంకర్ అన్నారు. మహిళలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ముందుకెళ్లాలని కోరారు. మహిళా సంఘాల గురించి పలు విషయాలు వెల్లడించారు.

(శాలిగౌరారం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని మహిళా సమభావన సంఘాలు ఉన్నాయి. ఎంత మంది సభ్యులు ఉన్నారు?

ఏపీఎం: మండలంలో 1025 సంఘాలకు గాను 10,944 మంది సభ్యులుఉన్నారు

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని గ్రామ సంఘాలు ఉన్నాయి?

ఏపీఎం: మండలంలో 32 గ్రామ సంఘాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: ఇంకా ఏమైనా కొత్త సంఘాలు ఏర్పాటు చేస్తున్నారా?

ఏపీఎం: గ్రామాల్లో మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నాం. సభ్యులు తగ్గిన చోట కొత్త వారిని చేర్పించడంతో పాటు కొత్త సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని సంఘాలకు బ్యాంక్ లోన్లు ఎంత ఇచ్చారు?

ఏపీఎం: మండలంలో 100 సంఘాలకు రూ.11.41 కోట్లు అందజేశాం.

ఆంధ్రజ్యోతి: స్త్రీనిధి నుంచి ఎంత మందికి లోన్లు ఇచ్చారు?

ఏపీఎం: స్త్రీనిధి నుంచి 46 సంఘాలకు రూ.1.08 కోట్లు ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి: మహిళా శక్తి కింద ఏఏ కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఏపీఎం: మహిళా శక్తి కింద పాలు ఇచ్చే గేదెల యూనిట్లు, పెరటి కోళ్ల పెంపకం తదితర యూనిట్లు మంజూరు చేస్తున్నాం. 13 నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న వారికి కిషోర బాలికల సంఘం, 60 ఏళ్లకు పైగా వయస్సు ఉన్న వారికి వృద్ధాప్య మహిళా సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం.

గణపయ్య @ రూ.198.74 కోట్లు

(5వ పేజీ తరువాయి)

భారీ విగ్రహాలను సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి, నల్లగొండ, నకిరేకల్, మిర్యాలగూడ, హాలియా, చండూరు, చౌటుప్పల్, నార్కట్‌పల్లి, భువనగిరి, దేవరకొండ, మల్లేపల్లి, చిట్యాల, మోత్కూరు, ఆలేరు పట్టణాలతో పాటు మిగతా మండల కేంద్రాలు, గ్రామాలలో ఏర్పాటుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం కావడంతో కొందరు రాజకీయ నాయకులు వినాయక విగ్రహాలను కొనుగోలు చేసి ఉత్సవ నిర్వాహకులకు అందచేశారు.

తగ్గిన మట్టి విగ్రహాలు

గతంతో పోలిస్తే ఈసారి మట్టి వినాయక విగ్రహాలు తగ్గాయి. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను నెలకొల్పాలని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా ఉత్సవ కమిటీలు పీవోపీ విగ్రహాల వైపే మొగ్గు చూపారు. గతంతో పోలిస్తే పెద్దసైజుతో కూడిన పీవోపీ విగ్రహాలను ఎక్కువగా నెలకొల్పారు. ఇదిలా ఉండగా అన్ని మునిసిపాలిటీల్లో చిన్నసైజు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు కూడా బంకమట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

ఉత్సవాలకు ఖర్చు సుమారు రూ.198.74కోట్లు

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది గణేష్ నవరాత్రోత్సవాలకు నిర్వాహకులు సుమారు రూ.198.74కోట్లు ఖర్చు చేశారు. ఇందులో విగ్రహం ఖరీదు మొదలు, ప్రత్యేక మండపం, అలంకరణలు, ప్రత్యేక పూజలు, పురోహితులకు, పూజా సామాగ్రి, మైక్, విద్యుత్ సౌకర్యంతో పాటు శోభాయాత్ర, ఇతరత్రా ఖర్చుల ఉన్నాయి. అంతేకాకుండా ఉత్సవాల మధ్యలో అన్నదానాలు, ప్రత్యేక ప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు ఉన్నాయి. వీటికి కూడా పెద్దఎత్తున ఖర్చు చేశారు. అదేవిధంగా శోభాయాత్ర రోజు వాహనాలకు, బ్యాండ్ మేళాల కోసం రూ.వేల నుంచి రూ.లక్షల వరకు ఖర్చు చేశారు. ఇవన్నీ కాక కొంతమంది మద్యానికి రూ.వేలల్లో ఖర్చు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా ఉత్సవాల్లో చివరి రోజు నిర్వహించిన లడ్డూ వేలం పాటల్లో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. కొన్నిచోట్ల రూ.లక్షల్లో వేలం పాడి దక్కించుకున్నారు.

అత్యధికంగా విగ్రహాలకే...

ఉత్సవాల్లో ప్రధానంగా ఆకట్టుకునే విగ్రహం ఏర్పాటుకు నిర్వాహకులు ఆసక్తి చూపించారు. భారీ సైజుతో పాటు ఆకట్టుకునే విగ్రహాల కోసం రూ.లక్షల్లో ఖర్చు చేశారు. అదేవిధంగా మండప అలంకరణ, బ్యాండ్ మేళాలు, ప్రసాదాలకు ఎక్కువగా ఖర్చు చేశారు.

బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

గట్టుప్పల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): త్రిపుల్ ఆర్ వల్ల భూములు కోల్పోతున్న రైతులకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని, 2013 చట్టాన్ని అమలుచేసి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో ఆదివారం త్రిపుల్‌ఆర్ రోడ్డు భూబాధితులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రోడ్డు విస్తరణపై చేసిన మూడు అలైన్‌మెంట్లలో ఒకటి, రెండు అలైన్‌మెంట్ అమలు చేయాలని, మూడవ అలైన్‌మెంట్‌లో రైతులు భూములు కోల్పోతున్నారని అన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే రోడ్డు పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరారు. మారుమూల గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు పునరుద్ధరించాలన్నారు. సెప్టెంబరు 12న సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు పగిళ్ల శ్రీనివాస్, అచ్చిన శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం, మల్లే శివ, బండారి కృష్ణయ్య, పబ్బు మారయ్య, కట్ట కృష్ణయ్య, సత్తయ్య, విజిలి రాములు, అచ్చిన బీరయ్య పాల్గొన్నారు.

రైతులకు మళ్లీ నిరాశే!

(5వ పేజీ తరువాయి)

యూరియా కొరత కారణంగా ఇది నిలిచింది.

అక్టోబరులోనైనా వచ్చేనా?

ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కొనసాగిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం గత ఆరేళ్లుగా నిలిచింది. దీంతో రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించే అవకాశాలు లేకుండా పోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటిసారి ఏర్పడిన సందర్భంలో నాలుగేళ్ల పాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని కొనసాగించి, ఆ తరువాత ఆరేళ్ల పాటు నిలిపివేసింది. రైతుల నుంచి రైతు సంఘాల నుంచి పథకం అమలు కోసం డిమాండ్ వచ్చినా, గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం గత ఏడాది యాసంగి నుంచే రైతులకు రాయితీపై యంత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. ప్రస్తుతం పథకం అమలును ప్రారంభించ తలపెట్టినా రెండుమార్లు వాయిదా పడటంతో రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు. కనీసం అక్టోబరు మాసంలోనైనా అమలవుందా? లేదా? అనే సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అవసరమైన ఉపకరణాలు, యంత్రాలను రాయితీపై సరఫరా చేయడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేయడమేగాక జిల్లాల వారీగా రైతుల నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంది. ఆ మేరకు ఉమ్మడి జిల్లాల వ్యవసాయ అధికారుల నుంచి నివేదికలు తీసుకుంది. రైతులకు అందజేయాల్సిన పనిముట్లు, మొత్తం 15 రకాల యంత్ర పరికరాల జాబితాను కూడా రూపొందించింది. అందులో రోటర్‌వేటర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, డ్రోన్లు ఉన్నాయి. అయి తే పథకం అమలు వాయిదా పడటంతో వీటి పంపిణీ నిలిచింది.


అ'పూర్వ' సమ్మేళనం

● 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు



ఉరుమడ్ల పూర్వ విద్యార్థుల సిల్వర్‌జూబ్లీ కార్యక్రమంలో పాల్గొన్న నాటి ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరుమడ్ల జడ్పీహెచ్ఎస్ 2000-01 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం నార్కట్‌పల్లి శివారులోని హోటల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. చిన్ననాటి స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం గురువులను శాలువాలు కప్పి పూలమాలలు వేసి జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ఎల్ఎన్ రావు, సాంబయ్య, యోగేంద్రనాథ్, నర్సింహారెడ్డి, నారాయణ, రవీందర్ పూర్వ విద్యార్థులు వర్దం శ్రీశైలం, సామ బాబు, చెరుకు వెంకన్న, చెన్నోజు వెంకటేష్, ఉయ్యాల పరమేశ్వర్, పాకల సత్యనారాయణ, స్వప్న, శిరీష, దోటి జానయ్య, గణేష్, లింగస్వామి, రజిత, సంతోష, రాధిక, శోభారాణి, వనజాత పాల్గొన్నారు.




ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	1,67,886	1,67,886
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,424.06	1,711.69
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.423 (43.3542)	1,34,00	1,43,502

చికెన్ ధరలు	లైవ్ : రూ.120	డ్రెస్ : రూ.200	స్కిన్‌లెస్ : రూ.220

కనువిందుచేసిన చంద్రగ్రహణం



ఆకాశంలో చంద్రుడి అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఆదివారం రాత్రి 9.56 నుంచి 1.26 గంటల వరకు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడింది. ఈ సుందర దృశ్యాన్ని పలువురు తిలకించేందుకు ఆసక్తి చూపగా, కొందరు ఇళ్లకే పరిమితమై స్వామి వారి నామస్మరణలో నిమగ్నమయ్యారు. సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి, జిల్లా కేంద్రంలోని రామాలయంతోపాటు పలు ఆలయాలను, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో ఆదివారం మధ్యాహ్నం 12.25 గంటలకు స్వామివారికి రాజభోగం నిర్వహించి ద్వారబంధనం చేశారు. గుట్టలో సోమవారం వేకువజామున 3.30గంటలకు ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ అనంతరం 5.30గంటలకు సుప్రభాతం సేవ నిర్వహించనున్నారు. 7



చెర్వుగట్టు ఆలయ ద్వారబంధనం చేస్తున్న దేవస్థాన సిబ్బంది

గణపయ్యా @198.74 కోట్లు







- నవరాత్రోత్సవాలకు పెద్దఎత్తున ఖర్చు
- అధికంగా విగ్రహాలు, అన్నదానం, పూజారులకు
- బ్యాండ్ మేళాలు, అలంకరణలకు సైతం
- ఉమ్మడి జిల్లాలో 13,284 విగ్రహాలు నెలకొల్పిన భక్తులు



అన్నదానం చేస్తున్న భక్తులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గణేష్ నవరాత్రోత్సవాలను ప్రజలు వైభవంగా నిర్వహిస్తుంటారు. దేనికీ వెనుకాడకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం సాంప్రదాయంగా వస్తోంది. కొన్నిచోట్ల ఉత్సవాలు మూడు, ఐదు రోజులకే పరిమితం అవుతుంటాయి. అయితే ఏడాదికేడాది ఉత్సవాల ఖర్చు పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 13,284 విగ్రహాలను ప్రతిష్ఠించగా సుమారు రూ.197.74 కోట్లు ఖర్చు చేసినట్లు అంచనా.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట (కలెక్టరేట్)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ ఏడాది గణేష్ నవరాత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. ప్రతిష్ఠాపన నుంచి శోభాయాత్ర వరకు ఆనందోత్సాహాల మధ్య కన్నుల పండువగా ఉత్సవాలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 13,284 గణేష్ విగ్రహాలను నెలకొల్పగా అందులో సూర్యాపేట జిల్లాలో 3,250, నల్లగొండ జిల్లాలో 5,984.... యాదాద్రి-భువనగిరి జిల్లాలో4,050 ఉన్నాయి.

- మిగతా 8వ పేజీలో...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో..

అవసరాలు	ఖర్చు (రూ. కోట్లలో)
విగ్రహాలకు	56.84
అన్నదానం పులిహోర	53.64
శోభాయాత్రకు	3.51
పురోహితులకు	14.62
అలంకరణ బ్యాండ్‌మేళాలు లైటింగ్	45.13
పూజాసామాగ్రి	15
మద్యానికి	10
మొత్తం	198.74

విషాదాలు వెన్నంటే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రోత్సవాల్లో పలు అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. నల్లగొండ జిల్లా వేముల పల్లి మండలకేంద్రంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వలో విగ్రహాలను నిమజ్జనం చేసిన అనంతరం స్నానం చేస్తూ మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన తండ్రీ, కుమారులు పున్న సాంబయ్య, శివమణిలు గల్లంతయ్యారు. తండ్రి సాంబయ్య మృతదేహం లభ్యమైంది. అదే విధంగా సూర్యాపేటలోని పూలసెంటర్ సమీపంలో గణేష్ శోభాయాత్రలో పట్టణానికి చెందిన ఆలేటి శ్రీనివాస్ చిన్నారులతో కలిసి డ్యాన్స్ చేస్తూ గుండెపోటు రావడంతో కుప్పకూలి మృతి చెందాడు. కోదాడలో శోభాయాత్ర సందర్భంగా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నరేష్‌పై కొందరు యువకులు మద్యం మత్తులో దాడి చేయగా కానిస్టేబుల్ తలకు తీవ్రగాయమైంది. తిప్పర్తి మండలంలో నిమజ్జనం చేసి వస్తూ ట్రాక్టర్ పైనుంచి పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు.

లంబోదరుడి లడ్డూకు.. డిమాండ్



రూ.లక్షలు వెచ్చించి దక్కించుకున్న భక్తులు 6



నల్లగొండలో రూ.5,00,116 లక్షలకు లడ్డూను వైవసం చేసుకున్న ఇంజనీర్ బొడ్డుపల్లి సతీష్

జడ్చర్ల-కోదాడ ఎన్‌హెచ్-167 విస్తరణకు

కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్



నాలుగు లేన్లుగా మారనున్న దేవరకొండ-కోదాడ జాతీయ రహదారి

- నాలుగు లేన్లుగా దేవరకొండ-కోదాడ రహదారి
- 219కి.మీ మేర విస్తరణ
- రోడ్ల విస్తరణతో దేవరకొండ వ్యాపారుల ఆందోళన
- బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి

దేవరకొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల-కోదాడ వయా దేవరకొండ మీదుగా వెళ్లే జాతీయ రహదారి-167ని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న రహదారి జడ్చర్ల, కల్వకుర్తి, దేవరకొండ, కొండమల్లేపల్లి, హాలియా, మిర్యాలగూడ మీదుగా కోదాడ వరకు 219 కిలోమీటర్లు నాలుగు వరుసలుగా మారనుంది. 2028 వరకు రోడ్ల విస్తరణ పూర్తి చేయాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రోడ్ల విస్తరణ నేపథ్యంలో దుకాణాలు పోతాయని దేవరకొండ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గతంలో రోడ్ల విస్తరణతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, మళ్లీ నాలుగు లేన్ల విస్తరణతో వ్యాపారాలు దెబ్బతింటాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బైపాస్ ఏర్పాటు చేయాలని విన్నపం

కోదాడ-జడ్చర్ల, దేవరకొండ మీదుగా జాతీయ రహదారి విస్తరణలో బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని వ్యాపారులు ప్రజాప్రతినిధులను కలిసి విన్నవిస్తున్నారు. గతంలోనే రోడ్డు విస్తరణలో నష్టపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నామని వ్యాపారులు చెబుతున్నారు. రోడ్డు విస్తరణకు అనుకూలమైనప్పటికీ దేవరకొండ మీదుగా కొండమల్లేపల్లికి బైపాస్ చేస్తే ఇబ్బందులు ఉండవని వారు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ అధికారులను వివరణ కోరగా రోడ్ల విస్తరణపై ఇంకా మార్గదర్శకాలు రాలేదని, పూర్తి సమాచారం లేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి



జడ్చర్ల-కోదాడ వయా దేవరకొండ మీదుగా నాలుగు లేన్ల రహదారిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం హర్షణీయం. రోడ్డు విస్తరణ జరిగితే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయి. దీంతోపాటు వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. స్థానిక భూములకు సైతం డిమాండ్ పెరుగుతుంది.

● నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, దేవరకొండ

రైతులకు మళ్లీ నిరాశే!

- వ్యవసాయ యాంత్రీకరణ మరోసారి వాయిదా
- యూరియా సమస్య తీరాకే యాంత్రీకరణపై దృష్టి
- మౌఖిక ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- అక్టోబరులోనే పరికరాలు పంపిణీ చేసే అవకాశం
- లబ్ధిదారులకు ఎంపికకు ప్రారంభంకాని కసరత్తు

నల్లగొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూపొందించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం రెండో మారు కూడా వాయిదా పడింది. ప్రస్తుతం యూరియా కొరత ఏర్పడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు దీనిపై దృష్టిసారించారు. ఫలితంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు పక్కనపడింది.

యాంత్రీకరణ పథకానికి సంబంధించి గతంలో ఉన్న మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం మార్చి నూతన మార్గదర్శకాలను ఈ ఏడాది జూలై నెలాఖరున విడుదల చేసింది. దీంతో వ్యవసాయశాఖ అధికారులు నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించారు. అయితే వానాకాలం సీజన్‌లో యూరియా కొరత తీవ్రం కావడంతో ప్రభుత్వం తప్పని పరిస్థితిలో అక్టోబరు నెలకు ఈ పథకాన్ని వాయిదా వేసింది. ఈ మేరకు ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీచేసింది.


యాంత్రీకరణకు రూ.6.18కోట్లు కేటాయింపు

వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు కోసం ఉమ్మడి జిల్లా ప్రభుత్వం రూ.6.18కోట్లు కేటాయించింది. అందులో నల్లగొండ జిల్లాకు రూ.3.14కోట్లు, సూర్యాపేటకు రూ.1.84కోట్లు, యాదాద్రి జిల్లాకు రూ.1.24కోట్లను వ్యయం చేయనుంది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ ఇవ్వనుండగా జనరల్ కేటగిరీ రైతులకు 40శాతం సబ్సిడీ వర్తింపజేయనున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం అమలు ఆలస్యం కావడంతో బడ్జెట్ కేటాయింపులు చేయలేకపోయారు. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపులు పూర్తికాగా, యూరియా కొరత కారణంగా వాయిదా పడింది. ఈ పథకాన్ని అక్టోబరులో పూర్తిస్థాయిలో అమలు చేసే అవకాశాలు ఉన్నాయి.

పూర్తికాని దరఖాస్తుల పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించి గత నెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వ్యవసాయశాఖ అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. అదే విధంగా గతంలో రైతులు చేసుకున్న దరఖాస్తులను సైతం అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. మండల వ్యవసాయాధికారులు అన్ని దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపారు. అయితే ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు గత నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఈ దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. ఇదే సమయంలో రైతులకు యూరియా కష్టాలు మొదలవడంతో దరఖాస్తుల పరిశీలను అధికారులు వాయిదా వేశారు. అదే విధంగా మండల స్థాయిలో కమిటీలు సైతం లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు చేయాల్సి ఉంది. ఒకవేళ దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కారణాలను కూడా రైతులకు తెలియజేయాలి. గతంలో పేర్కొన్న షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 21 నుంచి 27వ తేదీ వరకు ఎంపికైన రైతుల నుంచి డీడీలను తీసుకునే ప్రక్రియతో పాటు అదే నెల 27 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు యంత్ర పరికరాలకు ఆర్డర్ ఇవ్వడం, ఈ నెలలో 7 నుంచి 17వ తేదీలోగా అర్హత పొందిన ప్రతీ రైతుకు పరికరాలు పంపిణీ చేయాలి. అయితే

మిగతా 8వ పేజీలో...



ప్రవక్త బోధనలను యువత ఆచరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రవక్త బోధనలను యువత ఆచరించి సన్మార్గంలో నడవాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. ఆదివారం మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహ్మద్ ప్రవక్త మానవాళికి అందించిన బోధనలను ఆచరించినప్పుడే జీవితం సుఖమయంగా ఉంటుందన్నారు. యువత ముందుకు వచ్చి విరివిగా రక్తాన్ని దానం చేయాలన్నారు. రక్తదానం చేస్తే ఎందరో రోగుల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు.

మిలాద్ కమిటీ బాధ్యులు మాట్లాడుతూ, కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా సుమారు 15 రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి సేకరించిన రక్తాన్ని ప్రమాదాలబారిన పడిన రోగులకు అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఎమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మిలాద్ కమిటీ సభ్యులు గౌస్, ఏకే.ఖాన్, షరీఫ్, హషం, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ డబ్బులు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరారెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగులో ఉన్న కార్మికుల డబ్బును వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు దరఖాస్తు చేసుకున్న ఈఎస్ఐ, పీఎఫ్ క్లెయిమ్స్ పెండింగులో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఏఎల్‌వో, ఏసీఎల్, ఇతర సిబ్బంది నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న నల్లగొండలో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పోలె సత్యనారాయణ, సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఆవుట రవీందర్, యూనియన్ మండల అధ్యక్షుడు గాదె యాదయ్య, దోటి పరమేశ, తదితరులు పాల్గొన్నారు.

మరో గ్రంథాలయ ఉద్యమానికి శ్రీకారం

- నేడు 'పుస్తకంతో నడక' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- విద్యావికాస వేదిక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మరో గ్రంథాలయ ఉద్యమానికి శ్రీకారం చుట్టే 'పుస్తకంతో నడక' కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యావికాస వేదిక వ్యవస్థాపక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ, ఏ తోడూ లేనప్పుడు పుస్తకమే తోడుంటుందన్నారు. పుస్తకాలు చదివినకొద్దీ రాయిలాంటి మనిషి వజ్రంలా రాటుదేలుతాడని అన్నారు. పుస్తకాలు చదవడం అందరి జీవితంలో భాగంగా మారాలన్నారు. సినిమాలకు, షికార్లే కాకుండా అంతా గ్రంథాలయాలకు కూడా వెళ్లాలని అన్నారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ర్యాంకులు, మార్కులు తప్ప పిల్లలకు మరో ప్రపంచం తెలియకుండా చేస్తున్నారని అన్నారు. సెల్‌ఫోన్ చేతిలో ఉంటే అన్నీ తెలిసినట్లు భ్రమలో ఉంటున్నారని, ఇది పిల్లల భవితకు మంచిది కాదన్నారు. కొత్త తరానికి పఠనాసక్తిని పెంపొందించేందుకు ఈ నెల 8న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ భాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి చిక్కడపల్లి కేంద్ర గ్రంథాలయం వరకు పుస్తకం చేతపట్టి నడక కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, దీన్ని విజయవంతం చేయాలని కోరారు. రచయితలు, కవులు, జర్నలిస్టులు, విద్యావంతులు, పుస్తక ప్రియులు, ప్రచురణకర్తలు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాయుధ పోరు

సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతికంగా మట్టి మనుషులు సాయుధ పోరాటాన్ని నిర్వహించారని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలోని మగ్దుమ్ భవనంలో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి, భుక్తి కోసం దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మట్టి మనుషులు చేసిన రైతాంగ సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా బీజేపీ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సాయుధ పోరులో నాలుగువేల మంది అమరులు రక్త తర్పణ చేశారన్నారు. దొరలు, భూస్వాముల లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీలకే దక్కిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి సాయుధ పోరాట యోధులకు పింఛన్లను ఎత్తివేసిన హీనమైన చరిత్ర ఉందని విమర్శించారు. సెప్టెంబరు 17 పేరుతో బీజేపీ కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. ఈనెల 11 నుంచి 17 వరకు సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రైతాంగా సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. చిట్యాల మండలం గుండ్రాపల్లి గ్రామంలో 11న అమరుల స్థూపం వద్ద ఈ సాయుధ పోరాటం వారోత్సవాలు ప్రారంభిస్తామన్నారు. అదేవిధంగా ఈ నెల 10న నల్లగొండలో సీపీఐ కేంద్ర మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొరత అత్యధికంగా ఉన్నదని, కేంద్రం రాష్ట్ర ప్రభుత్వంపై కక్షగట్టి యూరియా కోటాను ఇవ్వకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

సమావేశంలో పార్టీ నాయకులు నలపరాజు రామలింగయ్య, పల్లా నర్సింహారెడ్డి, పల్లా దేవేందర్‌రెడ్డి, లోడంగి శ్రావణ్‌కుమార్, పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, బొల్లగిరి నర్సింహ, తిర్పారి వెంకటేశ్వర్లు, అంజచారి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణం.. ఆలయాల మూసివేత

చింతపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం దృష్ట్యా చింతపల్లి మండలంలోని పలు దేవాలయాలను అర్చకులు మూసివేశారు. మండలంలోని గొడకొండ్ల గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవాలయం, వేంకటేశ్వరనగర్ కొండపై వెలిసిన వేంకటేశ్వర స్వామి ఆలయం, గోపాల స్వామి దేవాలయాలను అర్చకులు మూసివేశారు. సోమవారం ఆలయాల్లో సంప్రోక్షణచేసి తెరవనున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక నల్లగొండ కమిటీ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పగిడిమర్రి వెంకటేశం, చక్రధార్, చంద్రమౌళి, పరమేష్, రంగారెడ్డి, నాగరాజు, కమలాకర్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీపీవోలు వచ్చేశారు!

● మండలానికి ఎనిమిది మంది కేటాయింపు ● నేడు విధుల్లో చేరనున్న జీపీవోలు



పూర్వ వీఆర్‌వోలు ఎట్టకేలకు తిరిగి రెవెన్యూ శాఖలోకి వచ్చేశారు. ప్రభుత్వం వారిని గ్రామ పాలన అధికారులుగా(జీపీవో)గా నియమించింది. గతంలో ఉన్న వీఆర్‌వో, వీఆర్‌ఏలను ఇకనుంచి జీపీవోలుగా పిలవనున్నారు.

(ఆంధ్రజ్యోతి-నిడమనూరు)

గ్రామాల్లో మళ్లీ నేటి నుంచి రెవెన్యూ వ్యవస్థ పని చేయనుంది. గతంలో గ్రామాల్లో పట్వారీలు, వీఏవోలు, వీఆర్‌వోలుగా ఉన్న వ్యవస్థ జీపీవో అయ్యింది. నిడమనూరు మండలంలో 29 గ్రామ పంచాయతీలకు గాను 15 రెవెన్యూ గ్రామాలున్నాయి. కానీ ప్రభుత్వం మండలంలో ఎనిమిది క్లస్టర్లుగా మాత్రమే గుర్తించి ఎనిమిది మంది జీపీవోలను నియమించింది. పోస్టింగులు పొందిన కొత్త జీపీవోలు సోమవారం నుంచి విధుల్లో చేరనున్నారు. జీపీవోల నియామకంతో గ్రామాల్లో భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. గతంలో ఉన్న వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థలను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రద్దుచేసి ఇతర శాఖల్లోకి పంపింది. ధరణి పోర్టల్‌ను అమలు చేసింది. కానీ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను గమనించిన ప్రస్తుత ప్రభుత్వం వీఆర్‌వో వ్యవస్థను తీసుకొస్తామని హామీ ఇచ్చింది. ధరణి పోర్టల్‌ను కూడా రద్దుచేసి కొత్తగా భూభారతి అమలు చేస్తున్న విషయం విధితమే. ఈ ఏడాది జూన్ 2 నుంచి జీపీవోలను నియమిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఎట్టకేలకు కాస్త ఆలస్యంగానైనా క్లస్టర్ గ్రామాలను గుర్తించి జీపీవోలను నియమించింది. భూభారతితో భూసమస్యలను పూర్తిగా పరిష్కారం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇటీవల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ఒక్కో గ్రామం నుంచి భూ సమస్యల పరిష్కారం కోసం వందల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. కానీ రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరత, సర్వేయర్ కొరత కారణంగా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని రైతులు వాపోతున్నారు. మండలానికి 10మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఇటీవల నియమించినప్పటికీ వారు ఇంకా శిక్షణలోనే ఉన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రస్తుతం ఒక్క గిర్దావర్(ఆర్ఐ) కూడా లేడు. గతంలో ఇద్దరు ఆర్ఐలు ఉన్నప్పటికీ వారిని ఇతర మండలాలకు బదిలీ చేసి వారి స్థానంలో ఇద్దరిని ఇక్కడకు పంపి వెంటనే పూర్వ స్థానాలకు బదిలీ చేశారు. దీంతో మండలంలో రెండు ఆర్ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

క్లస్టర్ గ్రామం	జీపీవో
నిడమనూరు	మాతంగి సురేష్
తుమ్మడం	సయ్యద్ నజీర్
ముప్పారం	పీవీ ప్రసాద్‌రావు
మారుపాక	నిడిగొండ నరేష్
శాఖాపురం	పరంగి సరిత
ఎర్రబెల్లి	గంటెకంప శ్రీనివాస్
వెనిగండ్ల	పాతకోటి సైదులు
రేగులగడ	షేక్ బాషా

ఎనిమిది మంది జీపీవోలు



మండలంలో 15 రెవెన్యూ గ్రామాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎనిమిది క్లస్టర్ గ్రామాలుగా గుర్తించి ఎనిమిది మంది జీపీవోలను నియమించింది. కొత్తగా నియమితులైన జీపీవోలు నేటి నుంచి విధుల్లో చేరనున్నారు. జీపీవోల నియామకంతో గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి దోహదం చేస్తుంది.

జంగాల కృష్ణయ్య, తహసీల్దార్.



పట్టణంలోని సాగర్‌రోడ్‌లోని గాంధీ విగ్రహం వద్ద కుప్పలుగా ఉన్న కేబుళ్లు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో గజిబిజిగా కేబుల్ వైర్లు

గజిబిజి.. ప్రమాదకరం

● పట్టణమంతా కేబుళ్లే.. ● పట్టించుకోని ప్రభుత్వశాఖలు

మునిసిపాలిటీ పరిధిలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేస్తున్న కేబుల్ వైర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అస్తవ్యస్తంగా అల్లుతున్న కేబుల్ తీగలతో ఇటీవలి కాలంలో జరిగిన దుర్ఘటనల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో వేలాడదీసిన కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

మునిసిపాలిటీల్లో కేబుల్ కనెక్షన్లతోపాటు ఇంటర్‌నెట్ కేబుళ్లు విద్యుత్ స్తంభాలకు వేలాడదీస్తుంటారు. అందుకు మునిసిపాలిటీ, విద్యుత్ శాఖల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కేబుల్ నెట్‌వర్క్ నిర్వాహకులు ఎలాంటి అనుమతులు తీసుకోకపోగా, తమ ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇక ఇటీవల కాలంలో జాతీయస్థాయి సంస్థలు పబ్లిక్ స్థలాల్లో సొంతంగా స్తంభాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఎక్కడబడితే అక్కడ గుంతలు తవ్వడంతోపాటు దీర్ఘకాలికంగా ఉండేలా కాంక్రీటు దిమ్మెలను ఏర్పాటు చేసుకుంటున్నారు.

అక్కడక్కడా కిందకు వేలాడుతూ..

కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సంస్థలు ఇష్టారీతిన తీగలు లాగుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్కువ ఎత్తులో, కనిపించిన స్తంభాలు, విగ్రహాలు, స్లాబు సువ్వలకు తీగలు కడుతుండటంతో సమస్య వచ్చినప్పుడు స్తంభాలు ఎక్కడానికి వీలుకావడం లేదు. ఇక బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లలోని డాబాలపై పద్మవ్యూహంగా ఉన్న కేబుల్ వైర్లతో కనీసం వాకింగ్ చేయలేకపోతున్నామని నివాసితులు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మునిసిపాలిటీ పరిధిలో స్తంభాలు, కేబుళ్లు ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. స్తంభాలపై వీధి దీపాలు మార్చాల్సి వచ్చినప్పుడు మునిసిపల్ సిబ్బందితో పాటు విద్యుత్ లైన్‌మెన్లు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడుతాం. ప్రైవేట్ నెట్ వర్క్ కంపెనీలు, కేబుల్ టీవీ ఆపరేటర్లు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వైర్లు లాగొద్దు.

జీ. శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

అంజిరెడ్డి రివర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

● మహిళ కడుపులోంచి మూడు కిలోల కణితి వెలికితీత



శస్త్రచికిత్స చేసి వెలికితీసిన కణితి

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న మహిళ కడుపులోంచి సుమారు మూడు కిలోల కణితిని వైద్యులు వెలికితీశారు. ఈ అరుదైన శస్త్ర చికిత్స మిర్యాగూడ పట్టణంలోని డాక్టర్ అంజిరెడ్డి రివర్ ఆస్పత్రిలో శనివారం జరిగింది. నల్లగొండ పట్టణానికి చెందిన ఫాతిమాబేగం అనే మహిళ కొన్నాళ్లుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం ఈ నెల 5న ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన మహిళను సీనియర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పరీక్షించారు. పొత్తికడుపు భాగంలో గర్భాశయం, మూత్రనాళానికి అతుక్కుపోయినట్లుగా ఏర్పడిన కణితిని అత్యాధునిక స్కానింగ్ పరికరాల సాయంతో ఆస్పత్రి వైద్యులు గుర్తించారు. మూత్రాశయానికి అతుక్కుపోయి మూత్రనాళం పనిచేయకుండా అడ్డుపడుతున్న కణితిని శనివారంరాత్రి అత్యాధునిక వైద్యపరికరాల సాయంతో తొలగించారు. మూత్రాశయానికి ఎలాంటి ప్రమాదం జరగకుండా కణతిని బయటకు తీసేందుకు ఆస్పత్రి వైద్యులు సుమారు ఆరు గంటలపాటు శ్రమించారు. గర్భాశయంలో కణతులు ఏర్పడడంతో అధిక రక్తస్రావం, వెన్ను నొప్పి, మూత్రాశయంపై ఒత్తిడి, అజీర్ణం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇలాంటి లక్షణాలు సదరు మహిళలో కనిపించడంతో వైద్యపరిజ్ఞాన శాస్త్రీయ పద్ధతిలో కణితిని గుర్తించి తొలగించామన్నారు. అతిక్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను ఆస్పత్రికి చెందిన ఐదుగురు వైద్యుల బృందం పూర్తి చేయగా, ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి ఎండీ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. త్వరలో తమ ఆస్పత్రిలో న్యూరాలజీ, అంకాలజీ విభాగాల వైద్యసేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. కాగా మహిళ కడుపులోంచి మూడు కిలోల కణితిని తొలగించిన వైద్య బృందానికి రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

● గౌడ సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీరాములుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములుగౌడ్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా మద్యం దుకాణాల్లో గౌడ కులస్తులకు 25శాతం కేటాయించాలని గౌడ సంక్షేమ సంఘ డివిజన్ అధ్యక్షుడు గుండు శ్రీరాములుగౌడ్ డిమాండ్‌చేశారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లు, మద్యం దుకాణాలు గౌడ కులస్తులకు కులవృత్తులుగా ఉన్నాయని, ఆయా వ్యాపారాల్లో తమను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా గౌడ కులస్తులకు పాతిక శాతం దుకాణాలు కేటాయించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు సురకారపు ఉదయ భాస్కర్‌గౌడ్, అన్నెబోయిన తిరుపతయ్య, గుణగంటి శ్రీనివాస్, పెద్ది సైదులు, అయితగాని సత్యం, విజయ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మిర్యాలగూడలో విలేకరులతో మాట్లాడుతూ మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసలే చాలీచాలని వేతనాలతో కుటుంబాలు పోషించలేక ఇబ్బంది పడుతున్న ఉద్యోగులకు ఆ జీతాలు కూడా సకాలంలో అందివ్వకపోవడం సరికాదన్నారు. ఆయా ఉద్యోగుల్లో సామాన్య, మధ్య తరగతి వారే ఉన్నారని, వారిని ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. సమావేశంలో సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, అంజి యాదవ్, ఉగ్గిడి శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులకు..

దామరచర్ల, సెప్టెంబర్ 7(ఆంధ్రప్రదేశ్): పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్ అన్నారు. ఆదివారం దామరచర్ల మండల గ్రామపంచాయతీ కార్మికుల మహాసభ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించడంతోపాటు రూ.26వేల వేతనం అందించాలన్నారు. యూనిఫాం, బెల్లం, సబ్బులు, చేతికి బ్లౌజ్‌లు, నూనె, సబ్బులు అందించాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాడపల్లి శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా అక్కినపల్లి సైదులు, ప్రధాన కార్యదర్శిగా ఎండీ జైహింద్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గుండు వెంకన్న, కనకదుర్గ, భిక్షం, నాగయ్య, జ్యోతి పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

అడవిదేవులపల్లి, సెప్టెంబర్ 7(ఆంధ్రజ్యోతి): నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మాతంగి రమేష్ ఆదివారం తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం విడుదల చేసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి డ్రాఫ్ట్ ఫొటో ఓటర్ల, పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు నేడు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు మండలస్థాయి సమావేశం జరుగుతుందన్నారు. ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

రైతులకు మళ్లీ నిరాశే!

(5వ పేజీ తరువాయి)

యూరియా కొరత కారణంగా ఇది నిలిచింది.

అక్టోబరులోనైనా వచ్చేనా?

ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కొనసాగిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం గత ఆరేళ్లుగా నిలిచింది. దీంతో రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించే అవకాశాలు లేకుండా పోయాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటిసారి ఏర్పడిన సందర్భంలో నాలుగేళ్ల పాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని కొనసాగించి, ఆ తరువాత ఆరేళ్లపాటు నిలిపివేసింది. రైతుల నుంచి రైతు సంఘాల నుంచి పథకం అమలు కోసం డిమాండ్ వచ్చినా, గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం గత ఏడాది యాసంగి నుంచే రైతులకు రాయితీపై యంత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. ప్రస్తుతం పథకం అమలును ప్రారంభించ తలపెట్టినా రెండుమార్లు వాయిదా పడటంతో రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు. కనీసం అక్టోబరు మాసంలోనైనా అమలవుందా? లేదా? అనే సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అవసరమైన ఉపకరణాలు, యంత్రాలను రాయితీపై సరఫరా చేయడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేయడమేగాక జిల్లాల వారీగా రైతుల నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంది. ఆ మేరకు ఉమ్మడి జిల్లాల వ్యవసాయ అధికారుల నుంచి నివేదికలు తీసుకుంది. రైతులకు అందజేయాల్సిన పనిముట్లు, మొత్తం 15 రకాల యంత్ర పరికరాల జాబితాను కూడా రూపొందించింది. అందులో రోటర్‌వేటర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, డ్రోన్లు ఉన్నాయి. అయితే పథకం అమలు వాయిదా పడటంతో వీటి పంపిణీ నిలిచింది.

యూరియా కోసం ఆందోళన చెందవద్దు

● అవసరమైన మేరకు యూరియా సరఫరాకు చర్యలు ● బ్లాక్‌లో అమ్మితే చర్యలు ● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని, రైతుల అవసరాలకు సరిపడే విధంగా సరఫరా చేస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నియో.కవర్గ పరిధిలోని మండల వ్యవసాయాధికారులు , వ్యవసాయ విస్తరణాధికారులు, సిఈఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు యూరియా అందిచేలా ప్రణాళికతో పింపిణీకీ ఏర్పాటు చేయాలని అన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేసేందుకే కేంద్రం యూరియా కొరతను సృష్టిస్తోందని ఆరోపించారు. దానిని అధిగమించేందుకు ప్రతి అధికారి సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. వచ్చిన యూరియాను రైతులందరికి అందే విధంగా చూడాలన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో ఇంచార్జీ ఏడిఏ సైదానాయక్, మండల ఏఓలు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పని తీరే అభివృద్ధి సూచిక

మిర్యాలగూడ టౌన్: అధికారుల పని తీరే అభివృద్ధిక సూచిక అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై మునిసిపల్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు ప్రణాళికలు రూపొందించి, నాణ్యాతా ప్రమాణాలతో చేయించాల్సిన అవసరముందన్నారు. శాఖల మధ్య సమన్వయం ఉండాలని, అధికారులు, ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలన్నారు. రాజకీయ నాయకుల పదవులు ఐదేళ్లుంటాయని, అధికారుల పదవీకాలం అరవై ఏళ్లకు పైగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఉద్యోగులందరూ దృష్టిలో పెట్టుకుని పని చేయాలన్నారు. నియోజకవర్గంలో అమృత్ నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, ఉపరితల ట్యాంకులు, తాగునీటి పైప్‌లైన్ తదితర పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్ధేశం చేశారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పురోగతి సాధించాలని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పట్టణంలోని ఫ్లైఓవర్ పైన, కింద సుందరీకరణ పనులు చేపట్టాలని, ఆయా పనులపై వారాంతపు నివేదికలు సమర్పించాలని అధికారులను కోరారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ, విద్యుత్, మునిసిపల్, ఇరిగేషన్, శానిటరీ విభాగ అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

పాల కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

హాలియా, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): పాల కార్మికులను ప్రభుత్వం గుర్తించి తక్షణమే గుర్తింపు కార్డులను అందజేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని పాడి రైతుల సంఘం రాష్ట్రనేత రిక్కల రామాంజిరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుత సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హాలియాలోని మార్కెట్‌యార్డులో నిర్వహించిన మిల్క్‌వర్కర్స్ జనరల్ బాడీ సమావేశానికి హాజరై మాట్లాడారు. పల్లెల నుంచి పాలు పట్టి పట్టణాల్లో ప్రతీ ఇంటికి అందిస్తున్న కార్మికులను వ్యాపారపరంగా కాకుండా సేవా దృక్పథంగా చూడాలన్నారు. వీరందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్నారు.

డీఎస్‌పీ నూతన కమిటీ ఎన్నిక

మాడ్గులపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) మండల నూతన కమిటీని ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి తరి ఎల్లయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జిల్లా నగేష‌మహారాజ్, ఉపాధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా బాలరాజు, కార్యవర్గ సభ్యులుగా చిట్యాల క్రాంతి, మట్టయ్య, సందీప్, కోశాధికారిగా చందు, సభ్యులుగా కిరణ్, కార్తీక్‌లను ఎన్నుకున్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు



వేములపల్లిలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వేములపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రధాన మోదీ ఆధ్వర్యంలో పలు రకాల నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించడం పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో ఊరటనిచ్చిందని బీజేపీ మండల అధ్యక్షుడు పెదమాం భరత్ అన్నారు. జీఎస్టీని రెండు స్లాబులకు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆదివారం మండల కేంద్రంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని ఎర్రకోట సాక్షిగా దేశ ప్రజలకు దీపావళి కానుకను అందిస్తామని చెప్పి ఆనతికాలంలోనే జీఎస్టీ స్లాబ్ రేట్లను తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. నరేంద్రమోదీ అధికారం చేపట్టిన అనతికాలంలోనే దేశ ఆర్థిక వ్యవస్థను 11వ స్థానం నుంచి నాలుగో స్థానానికి తీసుకొచ్చి ప్రపంచంలోనే పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిల్ జిల్లా సభ్యులు చిర్ర సాంబమూర్తి, చలమల్ల సీతారాంరెడ్డి, జవ్వాజి సత్యనారాయణ పందిరి బాగ్యమ్మ, యాదమ్మ, ఉపేందర్, ప్రభాకర్, నరేష్, వంశీ, మహేష్, మణి, సతీష్, నాగరాజు, వెంకటేష్, కార్తీక్, గోపి, ప్రశాంత్ పాల్గొన్నారు.

పన్ను సవరణ చరిత్రలో నిలిచిపోతుంది

మిర్యాలగూడ టౌన్: జీఎస్టీ పన్ను సవరణ చరిత్రలో నిలిచిపోతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాదినేని శ్రీనివాసరావు అన్నారు. జీఎస్టీ అమలులో సవరణలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ ఆదివారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, గృహోపకరణాల ధరలు తగ్గేలా వస్తుసేవల పన్ను శ్లాబులలో తెచ్చిన మార్పులు పేద, మధ్య తరగతి ప్రజలు, రైతులకు మేలు చేస్తాయన్నారు. విద్య, వైద్యం, బీమా, నిర్మాణ సామగ్రి ధరలు అమాంతం తగ్గనుండగా, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగనుందన్నారు. రవాణా వాహనాలు, ద్విచక్ర వాహనాలపై జీఎస్టీ కుదింపు చిరు వ్యాపారులపై ప్రభావం చూపుతుందని, ఆర్థిక ఇబ్బందులను తగ్గిస్తుందన్నారు. ప్రధాని మోదీ తీసుకుంటున్న నిర్ణయాలు, చేస్తున్న అభివృద్ధికి దేశప్రజలందరూ ఆకర్షితులవుతున్నారన్నారు. ప్రధాని మోదీ ప్రపంచ దేశాలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూనే దేశాన్ని ప్రగతిపథాన నడుపుతున్నారని కొనియాడారు. టూటౌన్ అధ్యక్షుడు పెద్దబోయిన వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్రనేతలు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, కనపర్తి సత్యప్రసాద్, సజ్జల నాగిరెడ్డి, ఎడ్ల రమేష్, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, బండారు ప్రసాద్, గుండ్లపల్లి శ్రీకాంత్, రేణుక, సృజన, వేణు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రావి నారాయణరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి



రావి నారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

దేవరకొండ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ రావి నారాయణరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ దేవరకొండ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకొండ సీపీఐ కార్యాలయంలో రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తికోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రావి నారాయణరెడ్డి అగ్రభాగాన నిలిచారని గుర్తు చేశారు. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో నెహ్రూకంటే ఎక్కువ ఓట్ల మెజార్టీని దక్కించుకున్నాడన్నారు. నేటి యువత రావి నారాయణరెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వలమాల ఆంజనేయులు, పల్లా రంగారెడ్డి, జూలూరి వెంకట్రాములు, మైనొద్దిన్, వెంకటయ్య, జ్యోతిబసు, శ్రీను పాల్గొన్నారు.

గణపయ్య @ రూ.198.74 కోట్లు

(5వపేజీ తరువాయి)

భారీ విగ్రహాలను సూర్యాపేట, కోదాడ, హుజుర్‌నగర్, తుంగతుర్తి, నల్లగొండ, నకిరేకల్, మిర్యాలగూడ, హాలియా, చండూరు, చౌటుప్పల్, నార్కట్‌పల్లి, భువనగిరి, దేవరకొండ, మల్లేపల్లి, చిట్యాల, మోత్కూరు, ఆలేరు పట్టణాలతో పాటు మిగతా మండల కేంద్రాలు, గ్రామాలలో ఏర్పాటుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం కావడంతో కొందరు రాజకీయ నాయకులు వినాయక విగ్రహాలను కొనుగోలు చేసి ఉత్సవ నిర్వాహకులకు అందచేశారు.

తగ్గిన మట్టి విగ్రహాలు

గతంతో పోలిస్తే ఈసారి మట్టి వినాయక విగ్రహాలు తగ్గాయి. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను నెలకొల్పాలని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా ఉత్సవ కమిటీలు పీవోపీ విగ్రహాల వైపే మొగ్గు చూపారు. గతంతో పోలిస్తే పెద్దసైజుతో కూడిన పీవోపీ విగ్రహాలను ఎక్కువగా నెలకొల్పారు. ఇదిలా ఉండగా అన్ని మునిసిపాలిటీల్లో చిన్నసైజు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు కూడా బంకమట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను పంపిణీ చేశాయి.

ఉత్సవాలకు ఖర్చు సుమారు రూ.198.74కోట్లు

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది గణేష్ నవరాత్రోత్సవాలకు నిర్వాహకులు సుమారు రూ.198.74కోట్లు ఖర్చు చేశారు. ఇందులో విగ్రహం ఖరీదు మొదలు, ప్రత్యేక మండపం, అలంకరణలు, ప్రత్యేక పూజలు, పురోహితులకు, పూజా సామాగ్రి, మైక్, విద్యుత్ సౌకర్యంతో పాటు శోభాయాత్ర, ఇతరత్రా ఖర్చుల ఉన్నాయి. అంతేకాకుండా ఉత్సవాల మధ్యలో అన్నదానాలు, ప్రత్యేక ప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు ఉన్నాయి. వీటికి కూడా పెద్దఎత్తున ఖర్చు చేశారు. అదేవిధంగా శోభాయాత్ర రోజు వాహనాలకు, బ్యాండ్ మేళాల కోసం రూ.వేల నుంచి రూ.లక్షల వరకు ఖర్చు చేశారు. ఇవన్నీ కాక కొంతమంది మద్యానికి రూ.వేలల్లో ఖర్చు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా ఉత్సవాల్లో చివరి రోజు నిర్వహించిన లడ్డూ వేలం పాటల్లో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. కొన్నిచోట్ల రూ.లక్షల్లో వేలం పాడి లడ్డూలను దక్కించుకున్నారు.

అత్యధికంగా విగ్రహాలకే...

ఉత్సవాల్లో ప్రధానంగా ఆకట్టుకునే విగ్రహం ఏర్పాటుకు నిర్వాహకులు ఆసక్తి చూపించారు. భారీ సైజుతో పాటు ఆకట్టుకునే విగ్రహాల కోసం రూ.లక్షల్లో ఖర్చు చేశారు. అదేవిధంగా మండప అలంకరణ, బ్యాండ్ మేళాలు, ప్రసాదాలకు ఎక్కువగా ఖర్చు చేశారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : వార్-2, వెంకటేశ్వర: మహావతార్ నరసింహ రాఘవ: కూలీ, విట్రోస్: కూలీ, పరదా, బన్ బటర్ జామ్ దేవరకొండ : మనోజ్ : వార్ 2 మైత్రి వెంకటేశ్వర : మహా అవతార్ నర్సింహ